పత్రికతో.. మార్పులు

APTEL/25/A1880

TN తెలుగు న్యూస్

దిన పత్రిక

మా కలం మీ గళం.. సామాన్యుని గుండె చప్పుడు..

సంపుటి : 1 సంచిక : 732 పబ్లిషర్స్ & చీఫ్ ఎడిటర్ : యన్. కృష్ణారావు ఎడిటర్ : ఎస్. మస్తాన్ గురువారం 1.10.2026 పేజీలు : 8 వెల : 4/-



# పేదల సంక్షేమమే లక్ష్యం

- సంక్షేమ పథకాల కన్వర్జెన్స్‌తో పేదలకు గరిష్ఠ ప్రయోజనం చేకూర్చాలని సీఎం ఆదేశం
- ప్రజాప్రతినిధులు, ఉద్యోగులకు ఐఐఎం, ఐఐటీల్లో శిక్షణ ఇచ్చే అంశంపై పరిశీలన
- పీ4 కార్యక్రమం పర్యవేక్షణకు సోషల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ తరహా వ్యవస్థ ఏర్పాటు
- అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ప్రజల నమ్మకాన్ని నిలబెట్టాలని సూచన
- సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనలో ఏపీని ఆదర్శంగా నిలపడమే ప్రభుత్వ లక్ష్యం

2లో

### క్వాంటమ్ టు కొలువులు

# ఏపీ భవితపై లోకేశ్ విజన్

**20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యమన్న మంత్రి లోకేశ్**

- యువత మార్పు కోరుకుంటోందన్న మంత్రి
- డీఎస్సీపై ఆరోపణలను కొట్టివేసిన లోకేశ్
- అమరావతిలో 156 బిట్ క్వాంటమ్ కంప్యూటర్ ఏర్పాటు ప్రస్తావన
- పెట్టుబడులకు 3ఎస్ విధానం అనుసరిస్తున్నామని వివరణ



యువతకు ఉద్యోగాల కల్పనే తమ ప్రభుత్వ ప్రధాన ఎజెండా అని ఏపీ విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. కొచ్చిలో జరిగిన ఇండియా టుడే కాంక్లేవ్ సౌత్-2026లో సీనియర్ జర్నలిస్టు, ఇండియా టుడే కన్సల్టింగ్ ఎడిటర్ రాజ్‌దీప్ సర్దేశాయ్‌తో జరిగిన ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలపై మాట్లాడారు.

*** యువతకు ఉద్యోగాలే తొలి లక్ష్యం**

యువత తమను అడుగుతున్నది ఒక్కటేనని.. మరిన్ని ఉద్యోగాలు కల్పించాలని కోరుకుంటున్నారని లోకేశ్ చెప్పారు. అందుకే ప్రభుత్వం 20 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. విద్యా పాఠ్యాంశాలను పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా మారుస్తున్నామని తరువాయి 2లో



### ఇకపై ఇంటర్నెట్ లేకుండానే

# మొబైల్‌లో లైవ్ టీవీ..!

- D2M టెక్నాలజీ అమలుకు కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు
- వాణిజ్య అమలు కోసం అక్టోబర్‌లో RFP జారీ
- మారుమూల ప్రాంతాల ప్రజలకు ప్రయోజనం

మొబైల్ ఫోన్‌లో లైవ్ టీవీ ఛానల్స్ చూడటానికి ఇకపై ఇంటర్నెట్ డేటా లేదా వైఫై అవసరం లేదు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం 'డైరెక్ట్‌టుమొబైల్' (D2M) అనే సరికొత్త టెక్నాలజీని వాణిజ్యపరంగా అందుబాటులోకి తెచ్చేందుకు వేగంగా అడుగులు వేస్తోంది. ఈ టెక్నాలజీ ద్వారా సిమ్ కార్డు, డేటా కనెక్షన్ లేకపోయినా నేరుగా మొబైల్‌లోనే టీవీ ప్రసారాలను వీక్షించవచ్చు. ఏంటీ D2M టెక్నాలజీ? D2M అనేది బ్రాడ్‌కాస్టింగ్, తరువాయి 2లో

### ఏపీలో SIR గడువు

# అక్టోబర్ 10 వరకు పొడిగింపు

- అక్టోబర్ 10 వరకు అభ్యంతరాలు, ఫిర్యాదుల పరిష్కారం
- అక్టోబర్ 16న తుది ఓటర్ల జాబితా ప్రచురణ
- అర్హులైన ఏ ఒక్క ఓటరు మిగిలిపోకూడదనే ఈ నిర్ణయం
- కొత్త తేదీలపై విస్తృత ప్రచారం చేయాలని అధికారులకు ఆదేశం




ఆంధ్రప్రదేశ్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) కార్యక్రమ గడువును భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) మరోసారి పొడిగించింది. తాజా ఉత్తర్వుల ప్రకారం, తుది ఓటర్ల జాబితాను 2026 అక్టోబర్ 16న ప్రచురించనున్నారు. గతంలో ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈ ప్రక్రియ అక్టోబర్ 9న పూర్తి కావాల్సి ఉండగా, తాజాగా మరో వారం పాటు గడువు పెంచడం గమనార్హం. కొత్త షెడ్యూల్ ప్రకారం, ఓటర్ల జాబితాపై అందిన అభ్యంతరాలు, ఫిర్యాదుల పరిష్కార తరువాయి 2లో

### రష్యా సైన్యంలో చేరొద్దు

# కేంద్రం హెచ్చరిక

- డబ్బు ఆశతో ప్రమాదకర మార్గంలో వెళ్లొద్దని సూచన
- పౌరసత్వం వదులుకుని మరీ కొందరు సైన్యంలో చేరుతున్నారని ఆందోళన
- ఇప్పటివరకు 139 మందిని సురక్షితంగా వెనక్కి రప్పించినట్లు వెల్లడి
- మిగిలిన వారిని రప్పించేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయని స్పష్టీకరణ

2లో





# క్రాకర్స్‌పై సుప్రీం ఊరట..

### పూర్తి నిషేధం కాదు!

- 24 గంటల పాటు కాల్చేందుకూ అనుమతించలేని స్పష్టీకరణ
- నిర్దిష్ట సమయాలపై నిబంధనలు వచ్చే అవకాశం
- గ్రీన్ క్రాకర్స్‌కు షరతులతో అనుమతికి సూచన
- బేరియం క్రాకర్స్‌పై సీపీసీబీ నివేదిక పెండింగ్
- తదుపరి విచారణ అక్టోబర్ 15న

దీపావళి వేళ బాణసంచా కాల్చడంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. బాణసంచాపై పూర్తిగా నిషేధం విధించేందుకు అంగీకరించబోమని స్పష్టం చేసింది. అదే సమయంలో రోజంతా ఎలాంటి పరిమితులు లేకుండా కాల్చేందుకు కూడా అనుమతించలేమని తేల్చి చెప్పింది. తరువాయి 2లో

### యూఎస్ వీసా పిడుగు

# డబుల్లైన ఇన్వెస్టర్ ఫీజులు!

- అమెరికా ఈబీ-5 ఇన్వెస్టర్ వీసా ప్రోగ్రామ్ ఫీజులను భారీగా పెంచుతూ నిర్ణయం
- భారతీయ పెట్టుబడిదారులలో గ్రీన్ కార్డ్ కోసం ఇది ఒక మార్గం
- కొన్ని దరఖాస్తు ఫీజులు రెట్టింపు కంటే ఎక్కువగా పెరిగిన వైనం




2లో

### మోదీ-ట్రంప్ ఫోన్ కాల్

# వాణిజ్యం, రక్షణపై చర్చ

- వ్యూహాత్మక భాగస్వామ్యంపై చర్చ
- ప్రాంతీయ పరిణామాలపై అభిప్రాయాల మార్పిడి
- ప్రపంచ శాంతి, భద్రతపై చర్చ
- సన్నిహితసంబంధాలు కొనసాగించేందుకు అంగీకారం



ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బుధవారం ఫోన్‌లో మాట్లాడుకున్నారు. ఈ సందర్భంగా భారత్‌అమెరికా ద్వైపాక్షిక సంబంధాల్లో కీలకమైన అంశాలపై చర్చించారు. వాణిజ్యం, రక్షణ, ఇంధనం, కీలక సాంకేతికతల రంగాల్లో ఇరు దేశాల సహకారాన్ని సమీక్షించినట్లు మోదీ తెలిపారు. ట్రంప్‌తో జరిగిన చర్చలు ఫలప్రదంగా సాగాయని మోదీ 'ఎక్స్'లో వెల్లడించారు. భారత్ అమెరికా సమగ్ర గ్లోబల్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు సన్నిహితంగా కొనసాగాలని ఇరు దేశాల నేతలు అంగీకరించినట్లు తెలిపారు. తరువాయి 2లో

# పేదల సంక్షేమమే లక్ష్యం: సీఎం చంద్రబాబు

రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలను సమన్వయం చేయడం ద్వారా పేదలకు గరిష్ఠ ప్రయోజనం చేకూరేలా చూడాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. పాలనలో నాణ్యత, పారదర్శకతను పెంపొందించేందుకు ప్రభుత్వ ఉద్యోగులతో పాటు ప్రజాప్రతినిధులకు కూడా ఐఐఎం, ఐఐటీల వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల్లో శిక్షణ ఇప్పించే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. బుధవారం 'పేదల సేవలో సంక్షేమ కార్యక్రమాల కన్వర్జెన్స్' అనే అంశంపై మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులతో ఆయన జూమ్ వేదికగా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ప్రస్తుతం ప్రతి పేద కుటుంబానికి సగటున 4 నుంచి 5 పథకాలు అందుతున్నాయని, స్త్రీశక్తి, తల్లికి వందనం, దీపం వంటి పథకాలన్నింటినీ సమన్వయం చేసి లబ్ధిదారులకు మరింత అండగా నిలవాలని సూచించారు. పేదరికం, ఆర్థిక అసమానతలు లేని నియోజకవర్గాలను తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేయాలని స్పష్టం చేశారు. పీ4 (ప్రజలుప్రభుత్వం ప్రైవేటు భాగస్వామ్యం) మోడల్ అమలు తీరును నిరంతరం పర్యవేక్షించాలని, ఇందుకోసం సోషల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ తరహా వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. రాష్ట్రంలో ఇప్పటికే 11 లక్షల బంగారు కుటుంబాలకు మార్గదర్శకులు పీ4 కార్యక్రమం కింద చేయూతనిస్తున్నారని ఈ సందర్భంగా గుర్తుచేశారు. పాలనలో సాంకేతికతను జోడించడం ద్వారా



పౌర సేవలను మరింత సులభతరం చేయవచ్చని సీఎం పేర్కొన్నారు. సేవలను సమర్థంగా అందించడం ద్వారా ప్రభుత్వంపై ప్రజల్లో సానుకూల దృక్పథం (పబ్లిక్ పాజిటివ్ పర్సెప్షన్) పెరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రజాప్రతినిధులతో పాటు ప్రతి ఉద్యోగికి కెపాసిటీ బిల్డింగ్ శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. కలెక్టర్లు, నోడల్ అధికారులు క్షేత్రస్థాయిలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలతో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని, తమ ప్రభుత్వం పొలిటికల్ గవర్నెన్స్‌కే అత్యంత ప్రాధాన్యమిస్తుందని స్పష్టం చేశారు. డ్వాక్రా మహిళల ఆర్థిక అభ్యున్నతి కోసం 'స్వయం బ్రాండ్'ను ప్రోత్సహిస్తున్నామని, మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి వివరించారు. పల్లె పండుగ 3.0 ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఆస్తులు కల్పించబడతాయని, అభివృద్ధి పనుల్లో నాణ్యత, పారదర్శకత తప్పనిసరి అని ఆదేశించారు. ఏటా అక్టోబర్ 2వ తేదీన రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ స్థాయిల్లో 'స్వచ్ఛాంధ్ర అవార్డులు' ప్రదానం చేయనున్నట్లు ప్రకటించారు. ద్రవ్యోల్బణ భారం ప్రజలపై పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, రైతు బజార్లలో తక్కువ ధరకు ఉల్లిని అందుబాటులోకి తెచ్చామని పేర్కొన్నారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనలో ఆంధ్రప్రదేశ్‌ను దేశానికే ఆదర్శంగా నిలపడమే తమ అంతిమ లక్ష్యమని, ఇందుకోసం అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా కృషి చేయాలని సీఎం పిలుపునిచ్చారు.

# క్వాంటమ్ టు కొలువులు

యువతకు ఉద్యోగాల కల్పనే తమ ప్రభుత్వ ప్రధాన ఎజెండా అని ఏపీ విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. కొచ్చిలో జరిగిన ఇండియా టుడే కాంక్లేవ్ సౌత్-2026లో సీనియర్ జర్నలిస్టు, ఇండియా టుడే కన్సల్టింగ్ ఎడిటర్ రాజ్‌దీప్ సర్దేశాయ్‌తో జరిగిన ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలపై మాట్లాడారు.

**యువతకు ఉద్యోగాలే తొలి లక్ష్యం**

యువత తమను అడుగుతున్నది ఒక్కటేనని.. మరిన్ని ఉద్యోగాలు కల్పించాలని కోరుకుంటున్నారని లోకేశ్ చెప్పారు. అందుకే ప్రభుత్వం 20 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. విద్యా పాఠ్యాంశాలను పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా మారుస్తున్నామని, వివిధ రంగాల్లో పెట్టుబడులు తీసుకొచ్చి ఉద్యోగ అవకాశాలు పెంచుతున్నామని చెప్పారు.

**జెన్-జీ మార్పు కోరుకుంటోంది**

కులం, మతం, ప్రాంతంతోసంబంధం లేకుండా యువతలో కొత్త మార్పు కనిపిస్తోందని లోకేశ్ అన్నారు. వ్యవస్థలో మార్పులు రావాలని కోరుకుంటున్న యువత ఒక వర్గంగా ముందుకు వస్తోందని చెప్పారు. యువతతో కలిసి సమస్యలకు పరిష్కారాలు వెతకడం తనకు ఉత్సాహాన్నిస్తోందన్నారు.

* **డీఎస్సీపై ఆరోపణలు.. సర్టిఫికెట్లపై క్లారిటీ**

ఆంధ్రప్రదేశ్‌లో డీఎస్సీ పరీక్షను పారదర్శకంగా నిర్వహించామని లోకేశ్ తెలిపారు. క్రీడా కోటాలో ఎంపికైన విద్యార్థులకు సంబంధించిన సర్టిఫికెట్లు గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రులు, ఎమ్మెల్యేలే జారీ చేశారని చెప్పారు. ఈ అంశంపై కోర్టు, సీబీఐ దర్యాప్తు కోరినా.. కోర్టు ఆదేశాలకు అనుగుణంగా ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు.

* **అమరావతిలో 156 బిట్ క్వాంటమ్ కంప్యూటర్**

క్వాంటమ్ టెక్నాలజీ ఊహ కాదని.. ఇది నెక్స్ట్ జనరేషన్ టెక్నాలజీ అని లోకేశ్ అన్నారు. తొలి 156 బిట్ క్వాంటమ్ కంప్యూటర్‌ను అమరావతిలో ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. పరిశోధనలు, మెటీరియల్ సైన్స్, క్రయోజెనిక్ టెక్నాలజీ వంటి రంగాల్లో పని చేస్తూ క్వాంటమ్ ఎకోసిస్టమ్‌ను నిర్మించాలనుకుంటున్నామని చెప్పారు.

**విద్యా వ్యవస్థలో సమూల మార్పులు**

విద్యా వ్యవస్థ భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మారాలని లోకేశ్ అన్నారు. గత రెండేళ్లలో 16 వేల మంది ఉపాధ్యాయులను నియమించామని తెలిపారు. ఏఐ నుంచి క్వాంటమ్ వరకు భవిష్యత్ టెక్నాలజీలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. విద్యా వ్యవస్థలో సంస్కరణలకు కనీసం దశాబ్ద కాలం పడుతుందని పేర్కొన్నారు.

**పెట్టుబడులకు '3ఎస్' మంత్రం**

ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులు తీసుకొచ్చేందుకు స్పీడ్, సర్వీస్, స్టెబిలిటీ అనే 3ఎస్ విధానాన్ని అనుసరిస్తున్నామని లోకేశ్ చెప్పారు. ప్రాజెక్టులకు వేగంగా అనుమతులు ఇవ్వడం, వాటి పురోగతిని ఎప్పటికప్పుడు పెట్టుబడిదారులకు తెలియజేయడం, ప్రభుత్వాలు మారినా విధానాల్లో స్థిరత్వం ఉండేలా చూడటం తమ విధానమన్నారు. వ్యవసాయం నుంచి క్వాంటమ్ వరకు 23 క్లస్టర్లలో పెట్టుబడులను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు.

క్రాకర్స్‌పై సుప్రీం ఊరట..

# పూర్తి నిషేధం కాదు..!

దీపావళి వేళ బాణసంచా కాల్చడంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. బాణసంచాపై పూర్తిగా నిషేధం విధించేందుకు అంగీకరించబోమని స్పష్టం చేసింది. అదే సమయంలో రోజంతా ఎలాంటి పరిమితులు లేకుండా కాల్చేందుకు కూడా అనుమతించలేమని తేల్చి చెప్పింది. జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ పి.బి.వరాలేతో కూడిన ధర్మాసనం బుధవారం ఈ అంశంపై విచారణ చేపట్టింది. దీపావళితో ముడిపడిన మతపరమైన భావాలను గౌరవిస్తూనే.. వాయు కాలుష్యం వల్ల పిల్లలు, వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారికి ఎదురయ్యే ఇబ్బందులను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందని పేర్కొంది.

**సమయాన్ని నిర్దేశించే అవకాశం**

బాణసంచా వినియోగానికి నిర్దిష్ట సమయాన్ని నిర్ణయించే దిశగా సుప్రీంకోర్టు మొగ్గు చూపింది. ఏ రకమైన బాణసంచాను ఉపయోగించాలన్న దానిపైనా నిబంధనలు విధించే అవకాశం ఉందని తెలిపింది. తదుపరి తరం జాయింట్ గ్రీన్ క్రాకర్స్‌లో నిర్దిష్ట రకాల బాణసంచాకు అనుమతి ఇవ్వడంపై కోర్టు సానుకూలంగా ఉన్నట్లు తెలిపింది. అయితే వాటి తయారీ విధానం, శబ్ద స్థాయి, షెల్స్ సంఖ్య, పరిమాణం, వరుసగా బాణసంచా కాల్చే మధ్య వ్యవధి వంటి అంశాలపై నిబంధనలు విధించనుంది.

**బేరియం బాసంచాపై ఇంకా పరీక్షలు**

బేరియం ఆధారిత బాణసంచా వల్ల పర్యావరణంపై పడే ప్రభావంపై కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) నివేదికను సమర్పించేందుకు కేంద్రం మరింత సమయం కోరింది. బేరియం ఆధారిత బాణసంచాపై బహిరంగ ప్రదేశంలో పరీక్షలు ఇంకా జరగలేదని అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి కోర్టుకు తెలిపారు. అక్టోబర్ 15 వరకు సమయం ఇవ్వాలని కోరారు. దీంతో కేంద్రం, నిపుణుల సంస్థలు తమ అంచనాలను పూర్తి చేసేందుకు సుప్రీంకోర్టు సమయం ఇచ్చింది. ఈ అంశంపై తదుపరి విచారణ అక్టోబర్ 15న జరగనుంది.

* **ఢిల్లీ-ఎన్‌సీఆర్ అంశంపై ఇప్పుడే ఆదేశాలు లేవు**

బాణసంచాపై పెండింగ్‌లో ఉన్న కొన్ని అంశాలు ఢిల్లీఎన్‌సీఆర్‌కు సంబంధించిన ఎం.సి. మెహతా కేసులో విచారణలో ఉన్న అంశాలతో ముడిపడి ఉన్నాయని సుప్రీంకోర్టు గుర్తించింది. ఈ అంశాలను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ముందు ప్రస్తావించేందుకు పార్టీలకు అనుమతి ఇచ్చింది. అవసరమైతే రెండు కేసుల్లోని ఉమ్మడి అంశాలను కలిపి విచారించే అవకాశం ఉంటుంది. అయితే ఢిల్లీఎన్‌సీఆర్ అంశంపై ప్రస్తుతం ఎలాంటి ఆదేశాలు ఇవ్వబోమని జస్టిస్ సుందరేశ్ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. బాణసంచా తయారీ, విక్రయాలపై నిషేధం కోరుతూ దాఖలైన ఇతర పిటిషన్లను మాత్రం విచారించనుంది.

# ఇకపై ఇంటర్నెట్ లేకుండానే మొబైల్‌లో లైవ్ టీవీ!

మొబైల్ ఫోన్‌లో లైవ్ టీవీ ఛానల్స్ చూడటానికి ఇకపై ఇంటర్నెట్ డేటా లేదా వైఫై అవసరం లేదు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం 'డైరెక్ట్‌టుమొబైల్' (D2M) అనే సరికొత్త టెక్నాలజీని వాణిజ్యపరంగా అందుబాటులోకి తెచ్చేందుకు వేగంగా అడుగులు వేస్తోంది. ఈ టెక్నాలజీ ద్వారా సిమ్ కార్డు, డేటా కనెక్షన్ లేకపోయినా నేరుగా మొబైల్‌లోనే టీవీ ప్రసారాలను వీక్షించవచ్చు.

**ఏంటీ D2M టెక్నాలజీ?**

D2M అనేది బ్రాడ్‌కాస్టింగ్, బ్రాడ్‌బ్యాండ్ కలయికతో పనిచేసే సాంకేతికత. దీని ద్వారా ఎలాంటి ఇంటర్నెట్ కనెక్షన్ లేకుండానే లైవ్ టీవీ, వీడియోలు, ఇతర మల్టీమీడియా కంటెంట్‌ను నేరుగా మొబైల్స్‌కు ప్రసారం చేయవచ్చు. ముఖ్యంగా ఇంటర్నెట్ సిగ్నల్స్ బలహీనంగా ఉండే గిరిజన, అటవీ, కొండ ప్రాంతాలు, మారుమూల గ్రామాల్లోని ప్రజలకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. ప్రసార భారతి, ఐఐటీ కాన్పూర్, తేజస్ నెట్‌వర్క్స్ (గతంలో సాంఖ్య ల్యాబ్స్) సంయుక్తంగా ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేశాయి. ఇప్పటికే దేశవ్యాప్తంగా 19కి పైగా నగరాల్లో ట్రయల్స్ విజయవంతంగా పూర్తయ్యాయి. వాణిజ్యపరమైన అమలు కోసం అక్టోబర్‌లో రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్ (RFP) జారీ చేయనున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. 470582 MHz స్పెక్ట్రమ్ బ్యాండ్‌లో ఈ ప్రసారాలు జరుగుతాయని, దీనివల్ల సెల్యులార్ నెట్‌వర్క్‌లకు ఎలాంటి అంతరాయం ఉండదని పరిశోధకులు స్పష్టం చేశారు. అయితే, ఈ టెక్నాలజీ విస్తృత వినియోగానికి కొన్ని సవాళ్లు ఉన్నాయి. D2M ప్రసారాలను స్వీకరించేందుకు ఫోన్లలో ATSC 3.0 ప్రమాణాలకు అనుగుణమైన హార్డ్‌వేర్ ఉండాలి. ప్రస్తుతం మార్కెట్లో ఉన్న చాలా స్మార్ట్‌ఫోన్లు దీనికి సపోర్ట్ చేయవు. మరోవైపు, ఈ టెక్నాలజీ వల్ల తమ డేటా ఆదాయానికి గండి పడుతుందని టెలికాం కంపెనీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

# రష్యా సైన్యంలో చేరొద్దు: కేంద్రం హెచ్చరిక

రష్యా సైన్యంలో చేరడం అత్యంత ప్రమాదకరమని, అటువంటి నిర్ణయాలు తీసుకోవద్దని భారత ప్రభుత్వం తన పౌరులను మరోసారి గట్టిగా హెచ్చరించింది. ఉక్రెయిన్‌తో యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో, ఆర్థిక ప్రయోజనాల కోసం ప్రాణాలను పణంగా పెట్టవద్దని సూచించింది. ఈ మేరకు కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. గత రెండేళ్లుగా హెచ్చరికలు జారీ చేస్తున్నప్పటికీ, కొందరు భారతీయులు రష్యా సైన్యంలో చేరుతున్నట్లు నివేదికలు అందుతున్నాయని విదేశాంగ శాఖ పేర్కొంది. అధిక ఆదాయం వస్తుందన్న ఆశతో కొందరు స్వచ్ఛందంగా రష్యా సైన్యంలో చేరి, ఆ తర్వాత సమస్యలు ఎదురైనప్పుడు భారత ప్రభుత్వాన్ని ఆశ్రయిస్తున్నారని వివరించింది. ఇది తీవ్ర ఆందోళన కలిగించే ధోరణి అని, ఇలాంటి చర్యలను ప్రభుత్వం ఏమాత్రం ప్రోత్సహించబోదని స్పష్టం చేసింది. తాత్కాలిక ఆర్థిక ప్రయోజనాల కోసం కొందరు భారతీయులు తమ భారత పౌరసత్వాన్ని వదులుకుని, రష్యా పాస్‌పోర్ట్ పొంది మరీ అక్కడి సైన్యంలో చేరుతున్న ఉదంతాలు తమ దృష్టికి వచ్చాయని విదేశాంగ శాఖ ఆందోళన వ్యక్తం చేసింది. ఇటువంటి చర్యల వల్ల తలెత్తే ప్రాణాపాయ పరిస్థితులను పౌరులు గమనించాలని హితవు పలికింది. అనధికారిక ఏజెంట్లు, కొన్ని సంస్థలు సైతం అక్రమంగా రిక్రూట్‌మెంట్లు చేస్తున్నాయని, ఇటువంటి ఉద్యోగ ఆఫర్ల పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని పౌరులకు విజ్ఞప్తి చేసింది. రష్యా సైన్యంలో ఉన్న భారతీయుల భద్రతతో పాటు, వారిని త్వరగా స్వదేశానికి రప్పించేందుకు రష్యా ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపింది. ఇప్పటివరకు 139 మంది భారతీయులను సురక్షితంగా వెనక్కి రప్పించామని, మిగిలిన సుమారు రెండు డజన్ల మందిని కూడా రప్పించేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయని విదేశాంగ శాఖ వెల్లడించింది.

# మోదీ-ట్రంప్ ఫోన్ కాల్: వాణిజ్యం , రక్షణపై చర్చ

ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బుధవారం ఫోన్‌లో మాట్లాడుకున్నారు. ఈ సందర్భంగా భారత్ అమెరికా ద్వైపాక్షిక సంబంధాల్లో కీలకమైన అంశాలపై చర్చించారు. వాణిజ్యం, రక్షణ, ఇంధనం, కీలక సాంకేతికతల రంగాల్లో ఇరు దేశాల సహకారాన్ని సమీక్షించినట్లు మోదీ తెలిపారు. ట్రంప్‌తో జరిగిన చర్చలు ఫలప్రదంగా సాగాయని మోదీ 'ఎక్స్'లో వెల్లడించారు. భారత్‌అమెరికా సమగ్ర గ్లోబల్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు సన్నిహితంగా కొనసాగాలని ఇరు దేశాల నేతలు అంగీకరించినట్లు తెలిపారు. ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపైనా ఇద్దరూ అభిప్రాయాలను పంచుకున్నారు. ప్రపంచ శాంతి, భద్రతను ముందుకు తీసుకెళ్లేందుకు జరుగుతున్న ప్రయత్నాలపై చర్చించారు. ఇరు దేశాల ప్రజల ప్రయోజనాల కోసం ద్వైపాక్షిక సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని నేతలు పునరుద్ఘాటించినట్లు ప్రధానమంత్రి కార్యాలయం తెలిపింది. అలాగే భవిష్యత్తులోనూ పరస్పరం సంప్రదింపులు కొనసాగించాలని నిర్ణయించినట్లు పేర్కొంది. భారత్‌అమెరికా సంబంధాల్లో వాణిజ్యం, రక్షణ, ఇంధనం, కీలక సాంకేతికతల వంటి రంగాలు ముఖ్యమైనవిగా కొనసాగుతున్నాయి. ఇరు దేశాల మధ్య వాణిజ్య సహకారం కొనసాగుతున్నప్పటికీ, ప్రస్తుతం సమగ్ర ద్వైపాక్షిక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అమల్లోలేదని విదేశాంగ మంత్రిత్వ శాఖకు చెందిన ఇండియా యూఎస్ ట్రేడ్ ఫెసిలిటేషన్ పోర్టల్ పేర్కొంటోంది. గతంలోనూ మోదీ, ట్రంప్ పలుమార్లు ఫోన్‌లో మాట్లాడుకున్నారు. ఈ ఏడాది జూన్‌లో జీ7 సదస్సు సందర్భంగా ఇద్దరూ భేటీ అయి భారత్‌అమెరికా సంబంధాలపై చర్చించినట్లు విదేశాంగ శాఖకు సంబంధించిన వివరాలను ఉటంకిస్తూ తాజా నివేదికలు తెలిపాయి.

# యూఎస్ వీసా పిడుగు: డబులైన ఇన్వెస్టర్ ఫీజులు!

అమెరికాలో పెట్టుబడులు పెట్టి, శాశ్వత నివాసం (గ్రీన్ కార్డ్) పొందాలనుకునే విదేశీయులకు, ముఖ్యంగా భారతీయులకు ఇది కీలకమైన పరిణామం. భారతీయ పారిశ్రామికవేత్తలు, కుటుంబాలు ఎక్కువగా ఆసక్తి చూపే ఈబీ5 ఇన్వెస్టర్ వీసా ప్రోగ్రామ్ ఫీజులను భారీగా పెంచుతూ అమెరికా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ కొత్త ఫీజుల నిబంధనను యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ (యూఎస్‌సీఐఎస్) మంగళవారం ఖరారు చేసింది. నూతన ఫీజులు ఈ ఏడాది నవంబర్ 30 నుంచి అమల్లోకి రానున్నాయి.

**ఏమిటీ ఈబీ-5 ప్రోగ్రామ్?**

అమెరికాలో పెట్టుబడులు పెట్టడం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, అమెరికన్లకు ఉద్యోగాలు కల్పించడం లక్ష్యంగా 1990లో ఈబీ5 ప్రోగ్రామ్‌ను ప్రారంభించారు. ఈ పథకం కింద విదేశీ పెట్టుబడిదారులు అమెరికాలోని వాణిజ్య సంస్థలలో నిర్దిష్ట మొత్తంలో పెట్టుబడి పెట్టి, కనీసం 10 మంది అమెరికన్లకు పూర్తికాల ఉద్యోగాలు కల్పించాలి. ప్రస్తుతం ఈ పెట్టుబడి మొత్తం అర్హత కలిగిన వ్యాపారంలో 1.05 మిలియన్ డాలర్లుగా, టార్గెటెడ్ ఎంప్లాయ్‌మెంట్ ఏరియా లేదా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టులలో అయితే 8 లక్షల డాలర్లుగా ఉంది. ఈ నిబంధనలు పాటిస్తే, పెట్టుబడిదారుడు, వారి జీవిత భాగస్వామి, అర్హులైన పిల్లలు గ్రీన్ కార్డ్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు.

# ఏపీలో SIR గడువు పొడిగింపు.. అధికారులకు కీలక ఆదేశాలు

ఆంధ్రప్రదేశ్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) కార్యక్రమ గడువును భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) మరోసారి పొడిగించింది. తాజా ఉత్తర్వుల ప్రకారం, తుది ఓటర్ల జాబితాను 2026 అక్టోబర్ 16న ప్రచురించనున్నారు. గతంలో ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈ ప్రక్రియ అక్టోబర్ 9న పూర్తి కావాల్సి ఉండగా, తాజాగా మరో వారం పాటు గడువు పెంచడం గమనార్హం. కొత్త షెడ్యూల్ ప్రకారం, ఓటర్ల జాబితాపై అందిన అభ్యంతరాలు, ఫిర్యాదుల పరిష్కార గడువును అక్టోబర్ 10 వరకు పొడిగించారు. ఈ గడువులోగా వచ్చిన అన్ని దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులను ఈసీ ఆదేశించింది. పెండింగ్‌లో ఉన్న విచారణలు (హియరింగ్‌లు), ముఖ్యంగా నోమ్యాపింగ్, లాజికల్ డిస్క్రిపెన్సీ కేసులు, ఫారం 6, 7, 8 దరఖాస్తులను పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. అర్హులైన ఏ ఒక్క ఓటరు కూడా జాబితాలో నమోదు కాకుండా మిగిలిపోకూడదనే లక్ష్యంతో ఈ పొడిగింపు ఇచ్చినట్లు పేర్కొంది. కాగా, 2026 జులై 31న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురించిన విషయం తెలిసిందే. మారిన తేదీల వివరాలను గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీలకు లిఖితపూర్వకంగా తెలియజేయాలని, మీడియా ద్వారా ప్రజలకు విస్తృతంగా ప్రచారం కల్పించాలని ఈసీ అధికారులను సూచించింది. ఆంధ్రప్రదేశ్‌తో పాటు మేఘాలయ వంటి ఇతర రాష్ట్రాల్లో కూడా ఓటర్ల జాబితా సవరణ గడువును కేంద్ర ఎన్నికల సంఘం పొడిగించింది.

## సంపాదకీయం

# స్థానికత చిక్కుముడి
# విద్యార్థిని భవిష్యత్తు బలి

రాష్ట్ర విభజన ఆంధ్రప్రదేశ్ ప్రజలకు గాయం చేసింది అనేది వాస్తవం. అయితే తెలంగాణ వారిని కూడా ఇబ్బంది పెడుతుంది అని ఈ మధ్య ఒక విద్యార్థిని విషయంలో రుజువయింది. తెలంగాణ వాస్తవ్యురాలైన ఒక విద్యార్థిని ఒకటో తరగతి నుండి పదో తరగతి వరకు తెలంగాణలోనే చదువుకుంది. అంటే పాఠశాల విద్య మొత్తం తెలంగాణలోనే పూర్తి చేసింది. ఆ అమ్మాయి లక్ష్యం వైద్య విద్యను అభ్యసించడమే. ఎంబీబీఎస్‌లో సీటు రావాలంటే నీట్ పరీక్ష తప్పనిసరి అయిన తర్వాత నీట్‌కు బెస్ట్ కోచింగ్ సెంటర్ల వెతుకులాట మొదలయింది. ఎవరో సీనియర్లు 'పొరుగున ఉన్న ఆంధ్ర రాష్ట్రంలో చదివి సీటు తెచ్చుకోగలిగాము' అనే సలహా ఇచ్చారు. అందుకోసం ఆ అమ్మాయి ఇంటర్మీడియట్ విజయవాడలో చదివింది. నీట్‌లో మంచి ర్యాంకు కూడా సాధించింది. తెలంగాణలో ఉన్న మంచి వైద్య విద్యా సంస్థల్లో సీటు కోసం దరఖాస్తు కూడా చేసింది. ఆ అమ్మాయి తాను తెలంగాణ వాసే కాక, తెలంగాణ విద్యార్థిని కాబట్టి తెలంగాణ స్థానిక కోటాలోనే సీటు వస్తుందని భావించింది. కానీ ఈ మధ్య రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో ఎంఎస్ నంబర్ 33 ప్రకారం ఒక విద్యార్థి స్థానిక కోటాలో 85 శాతం మెడికల్ సీట్లకు పోటీ పడాలంటే, నీట్ పరీక్షకు ముందున్న చివరి నాలుగు సంవత్సరాలు—అంటే తొమ్మిదో తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు—వరుసగా తెలంగాణలోనే చదివి ఉండాలి. కానీ ఆ విద్యార్థిని చివరి రెండు సంవత్సరాలు ఆంధ్రప్రదేశ్‌లో చదవడంతో, కాళోజీ నారాయణరావు ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం ఆమెను స్థానికేతర అభ్యర్థిగా ప్రకటించింది. హతాశురాలైన ఆ అమ్మాయి ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. తాను తెలంగాణలోనే జన్మించి, పదో తరగతి వరకు ఇక్కడే చదివానని, కేవలం ఇంటర్మీడియట్ కోచింగ్ కోసం పొరుగు రాష్ట్రానికి వెళ్ళానని, తనను తెలంగాణ స్థానిక విద్యార్థిగానే పరిగణించి ఎంబీబీఎస్ సీటుకు అవకాశం ఇవ్వాలని కోరింది. కానీ చట్టప్రకారం అటువంటి అవకాశం లేదని ఆ విద్యార్థిని అభ్యర్థనను తోసిపుచ్చి, ప్రభుత్వం పెట్టిన నిబంధన రాజ్యాంగబద్ధమైనదే అని న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. చట్టం ప్రకారం ఆ అమ్మాయి తెలంగాణ స్థానిక కోటాలోకి రాదు. అదే సమయంలో ఆ అమ్మాయి ఆంధ్రప్రదేశ్‌లో కూడా స్థానిక కోటాలోకి రాదు. ఇది మరీ బాధాకరం. రెండు రాష్ట్రాలలోనూ అర్హతను కోరే పరీక్షకు ముందు వరుసగా నాలుగు సంవత్సరాల నిరంతర విద్యాభ్యాస నిబంధన ఆ అమ్మాయి బంగారు భవిష్యత్తును ఛిద్రం చేసింది. ఇప్పుడు ఆ విద్యార్థినికి ఉన్న ఏకైక అవకాశం అఖిల భారత కోటాలో దేశవ్యాప్తంగా ఉన్న మెడికల్ కాలేజీల ఓపెన్ సీట్లకు పోటీ పడటమే; లేదా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో స్థానికేతరుల కోసం కేటాయించిన పదిహేను శాతం ఓపెన్ మెరిట్ సీట్లకు పోటీ పడవచ్చు. రాష్ట్రం విడిపోక ముందు ఇటువంటి సమస్యలతోనే అనేక మంది విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. కానీ రాష్ట్రం విడిపోయిన పన్నెండు సంవత్సరాల తర్వాత కూడా అవే సమస్యలతో విద్యార్థులు నలిగిపోవడం మాత్రం అన్యాయం. ఇందులో ప్రభుత్వాలను తప్పు పట్టలేం. చట్టం పట్ల అవగాహన లేనందుకు విద్యార్థులను తప్పు పట్టడం కష్టం. కానీ చట్టం గురించి అవగాహన లేదు అనేది న్యాయసమ్మతం కాదు. ఇక కోచింగ్ సెంటర్లు వారి వ్యాపారం వారు చూసుకుంటారు కానీ ఎదుటివారి ప్రయోజనాల కోసం తమ వ్యాపారాన్ని తగ్గించుకోరు. ఇక్కడ ఒక విచిత్రమైన విషయాన్ని గమనించాలి. ఒక వ్యక్తి లోక్‌సభకు పోటీ చేయాలంటే దేశంలో ఏదో ఒక ప్రాంతంలో ఓటర్ అయి ఉంటే చాలు. శాసనసభకు పోటీ చేయాలంటే రాష్ట్రంలో ఎక్కడో ఒక దగ్గర ఓటర్ అయి ఉంటే చాలు. కానీ ఒక విద్యార్థి దగ్గరకు వచ్చేటప్పటికి స్థానికతకు సంబంధించి కచ్చితమైన నిబంధనలు ఉన్నాయి. దేశంలో ఎవరు ఎక్కడైనా నివసించవచ్చు. ఎవరు ఎక్కడైనా ఆస్తులు కొనుగోలు చేయవచ్చు. ఆఖరికి కశ్మీర్‌లో కూడా ఆ సౌలభ్యం లభించింది. కానీ ఒక రిక్షా కార్మికుడు బతుకుతెరువు కోసం వేరే రాష్ట్రానికి వెళితే అతగాడి పిల్లలు ఉన్నత విద్యను అభ్యసించాలంటే కష్టం. వారికి ఎక్కడా స్థానికత లభించే అవకాశమే లేదు. చట్టాలు చేసేవారికి వర్తించని నియమ నిబంధనలు సామాన్య ప్రజలకు వర్తిస్తాయి. ఒక వ్యక్తి ఉపాధ్యాయుడు కావాలంటే నిర్దిష్ట విద్యార్హతలు కచ్చితంగా ఉండాలి. కానీ ఆ విద్యార్హతలను నిర్ధారించి చట్టాలు చేసే మంత్రులకు ఏ అర్హతా అవసరం లేదు; చట్టసభలో ఉంటే చాలు. పోనీ చేసిన చట్టాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించే బాధ్యత కూడా తీసుకోరు. ఆ విద్యార్థిని మెరిట్ చూస్తే ఆ అమ్మాయి తెలంగాణలో ఒక మంచి విద్యా సంస్థలో వైద్య విద్యను అభ్యసించవచ్చు. కానీ చట్టం పట్ల అవగాహన లేకపోవడమే ఆ అమ్మాయికి అనర్హతను తెచ్చిపెట్టింది. యాభై సంవత్సరాలు కలిసి ఉన్న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో విద్యను అభ్యసించేవారికి ఇంత అంతరం ఉండటం ఎంతవరకు న్యాయమో అర్థం కాదు. రెండు సంవత్సరాల క్రితం వరకు ఉమ్మడి రాజధాని హైదరాబాద్. అంటే మొన్నమొన్నటి వరకు కొన్ని ఉమ్మడి అంశాలు ఉన్నాయి. తెలంగాణను తీసుకొచ్చి ఆంధ్రాకు ముడిపెట్టడంలో తెలంగాణ ప్రజల పాత్ర లేదు. యాభై ఎనిమిది సంవత్సరాలు 'తమ రాజధాని' అంటూ మురిసిపోయి, తల తాకట్టు పెట్టి హైదరాబాద్‌లో ఇళ్లు కొనుక్కున్న వారి పిల్లలు ఏ రాష్ట్రంలో స్థానికులు అవుతారో ఆంధ్రప్రదేశ్ వారికి అంతుపట్టదు. కానీ తెలంగాణ శాసనసభలోకి అడుగుపెట్టడానికి ఇంత కఠినమైన నిబంధనలు లేవు. పెట్టుబడిదారులకు ఈ స్థానికత వర్తించదు; కానీ ఒక విద్యార్థిని విషయంలో మాత్రం కచ్చితమైన నిబంధనలు వర్తిస్తాయి. అమరరాజా బ్యాటరీస్ వారికి స్థానికత వర్తించదు. అశాస్త్రీయ విధానంలో రాష్ట్ర విభజన చేసిన ప్రభుత్వాలు ఇటువంటి విషయాలను వేటినీ స్పృశించలేదు. తెలంగాణ విద్యా సంస్థల్లో మహారాష్ట్ర వాసులకు ఎంత హక్కు ఉంటుందో ఆంధ్రప్రదేశ్ వారికి కూడా అంతే హక్కు అన్నట్లుగా మారింది. హైదరాబాద్‌ను సుసంపన్నం చేయడంలో ఆంధ్రప్రదేశ్ ప్రజల భాగస్వామ్యానికి ఏమాత్రం విలువ లేదు. ఆంధ్రప్రదేశ్‌ను తెలంగాణతో ముడిపెట్టడంలో ఆంధ్ర ప్రజల పాత్ర ఏమీ లేదు. కేంద్ర ప్రభుత్వం తలచుకుంది; అదే కలిపింది, అదే విడగొట్టింది. రెండు రాష్ట్రాల ప్రజల మధ్య వైషమ్యాలకు కూడా ప్రజల బాధ్యత లేదు. 'రెండు రాష్ట్రాలలో ఎక్కడ చదివినా ఒక్కటే' అనే ఒక చిన్న అమాయకపు ఆలోచన ఒక విద్యార్థిని జీవితాన్ని శాసించింది అనేది మాత్రం వాస్తవం. ఇక ముందైనా ప్రభుత్వాలు తాము చేసే చట్టాల పట్ల—ముఖ్యంగా విద్యార్థుల కెరీర్‌పై ప్రభావం చూపించే చట్టాల పట్ల—ప్రజలకు అవగాహన కల్పిస్తే ఇటువంటి ఇబ్బందులు తలెత్తవు. అర్హత పరీక్షకు ముందు నాలుగు సంవత్సరాలు నిరంతరం చదివి ఉండాలో, లేక నాలుగు సంవత్సరాలు ఆయా రాష్ట్రాలలో విడివిడిగా చదివి ఉంటే సరిపోతుందో తెలియని అయోమయంలో ఈ విద్యార్థిని మాదిరిగా రెండు రాష్ట్రాల విద్యార్థులు ఇకపై ఇబ్బంది పడకూడదు.!

- ఇంద్రాణి

## చరిత్రలో ఈ రోజు
### అక్టోబర్ 01

October 01

* ప్రపంచ వృద్ధుల దినోత్సవం, చైనా జాతీయదినోత్సవం, నైజీరియా జాతీయదినోత్సవం.
* ప్రపంచ శాకాహార దినోత్సవం
* 1847: హోమ్‌రూల్ ఉద్యమకర్త అనీ బిసెంట్ జననం (మ.1933). (చిత్రంలో)
* 1862: సంఘసంస్కర్త రఘుపతి వెంకటరత్నంనాయుడు జననం (మ.1939).
* 1869: ప్రపంచములో తొలిసారిగా పోస్టుకార్డును ఆస్ట్రియా దేశంలో విడుదల చేశారు.
* 1922: తెలుగు సినిమా హాస్యనటుడు అల్లు రామలింగయ్య జననం (మ.2004).
* 1926: భారతదేశంలో బ్రిటీష్ ప్రభుత్వం పబ్లిక్ సర్వీస్ కమీషన్ నెలకొల్పింది.
* 1928: దక్షిణ భారత సినిమా నటుడు శివాజీ గణేశన్ జననం (మ.2001).



అనీ బిసెంట్

* 1935: భారత సుప్రీంకోర్టు నెలకొల్పబడింది.
* 1946: సినిమా దర్శకుడు గూడవల్లి రామబ్రహ్మం మరణం (జ.1902).
* 1951: భారతదేశ లోక్‌సభ సభ్యుడు జి.ఎం.సి.బాలయోగి జననం (మ.2002).
* 1953: కర్నూలు రాజధానిగా ఆంధ్ర రాష్ట్ర అవతరణ.
* 1958: భారతదేశంలో మెట్రిక్ కొలతల పద్ధతి ప్రవేశపెట్టబడింది.

### సీఎం సభాస్థలి సమీపంలో
## పేలిన గ్యాస్ సిలిండర్




విజయవాడ: ముఖ్యమంత్రి చంద్రబాబు బహిరంగ సభ సమీపంలో భారీ శబ్దంతో గ్యాస్ సిలిండర్ పేలింది. విజయవాడ అజిత్‌సింగ్‌నగర్ మాకినేని బసవపున్నయ్య స్టేడియం సమీపంలో బుధవారం సాయంత్రం ఈ ఘటన జరిగింది. ఒక్కసారిగా భారీ శబ్దంతో గ్యాస్ సిలిండర్ పేలడంతో సభలో ఉన్న వారు ఆందోళనకు గురయ్యారు. అప్రమత్తమైన పోలీసులు క్షణాల వ్యవధిలో స్పందించి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. సభాస్థలికి కూతవేటు దూరంలోని ఓ నిమ్మకాయ సోడా బండి వద్ద ఉన్న గ్యాస్ సిలిండర్ పేలినట్టు పోలీసులు తెలిపారు. ఎండ తీవ్రత అధికంగా ఉండటం వల్ల సిలిండర్ పేలినట్టు ప్రాథమికంగా గుర్తించామన్నారు. పేలుడు ధాటికి సిలిండర్ సుమారు 60మీటర్ల దూరంలోని విద్యుత్ స్తంభంపై పడింది. దీంతో ఆ ప్రాంతంలో ఒక్కసారిగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పోలీసులు భద్రతా చర్యలు తీసుకోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.




### ఘనంగా ప్రారంభమైన
## ఒంగోలు 150 ఏళ్ల వేడుకలు

ఒంగోలు: ప్రకాశం జిల్లా కేంద్రం ఒంగోలులో 'ఒంగోలు 150 ఏళ్ల వేడుకలు' ఘనంగా ప్రారంభమయ్యాయి. ఒంగోలు పురపాలక సంఘంగా ఆవిర్భవించి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నగర కీర్తిని భావితరాలకు తెలియజేయాలనే ఉద్దేశంతో ఈ వేడుకలను నిర్వహిస్తున్నారు. మినీ స్టేడియం వేదికగా జరుగుతున్న ఈ ఉత్సవాల్లో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు, మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, గొట్టిపాటి రవికుమార్, డీఎస్‌బీవీ స్వామి, ఎంపీలు మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ తదితరులు పాల్గొన్నారు. ఒంగోలు కీర్తిని అతిథులు, ప్రముఖులు కొనియాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

### వివేకా హత్య కేసు..
## కొనసాగుతున్న ఉమాశంకర్‌రెడ్డి ఈడీ విచారణ

హైదరాబాద్: మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసులో ఏ3 నిందితుడు ఉమాశంకర్‌రెడ్డి రెండోరోజు ఈడీ విచారణ కొనసాగుతోంది. ఉదయం 10.30 గంటల నుంచి అధికారులు ఆయన్ను లోతుగా విచారిస్తున్నారు. హత్యకు జరిగిన రూ.40కోట్ల డీల్‌పై ఆరాతీసి బ్యాంక్ లావాదేవీలపై విచారణ చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే ఈ కేసులో నిందితులుగా ఉన్న ఎర్ర గంగిరెడ్డి, సునీల్‌కుమార్ యాదవ్‌తో పాటు అప్రూవర్‌గా మారిన దస్తగిరిని ఈడీ విచారించింది. వారు చెప్పిన వివరాల ఆధారంగా ఉమాశంకర్‌రెడ్డిని వివిధ కోణాల్లో ప్రశ్నిస్తోంది.

# భారీ స్థాయి పారిశ్రామికత ద్వారా భారత ఆర్థిక వ్యవస్థకు గణనీయమైన

* **అఖిల భారత ఆర్య వైశ్య పారిశ్రామికవేత్తల ఫోరం అధ్యక్షులు చారుగుండ్ల భవాని సురేష్**





ఆర్య వైశ్య పారిశ్రామికవేత్తలు కలసి భారీ స్థాయి పారిశ్రామికత ద్వారా భారత ఆర్థిక వ్యవస్థకు గణనీయమైన సహకారం అందిద్దామని అఖిల భారత ఆర్య వైశ్య పారిశ్రామికవేత్తల ఫోరం అధ్యక్షులు చారుగుండ్ల భవాని సురేష్ అన్నారు. విజయవాడలోని లెమన్ ట్రీ హోటల్ లో బుధవారం అల్ ఇండియా ఆర్యవైశ్య ఇండస్ట్రియలిస్ట్స్ ఫోరం ఆధ్వర్యంలో ఆర్య వైశ్య పారిశ్రామికవేత్తల ఇష్టాగోష్టి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాల నుంచి 100 మందికి పైగా ఆర్య వైశ్య పారిశ్రామికవేత్తలు 150 మందికి పైగా ఇండస్ట్రీ ఓనర్స్, అలాగే తెలంగాణ నుండి 50 మందికి పైగా ఇండస్ట్రీ ఓనర్స్ ఒకే వేదికపై సమావేశమై పరస్పర పరిచయాలు, వ్యాపార సంబంధాలు, సహకార అవకాశాలపై చర్చించడం జరిగింది. ఈ సందర్భంగా చారుగుండ్ల భవాని సురేష్ మాట్లాడుతూ "అనుసంధానం, సహకారం, వృద్ధి" నే లక్ష్యంతో దేశవ్యాప్తంగా ఉన్న ఆర్యవైశ్య పారిశ్రామికవేత్తలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి, పరస్పర వ్యాపార కొత్త అవకాశాల సృష్టి, అభివృద్ధి, నాలెడ్జ్ షేరింగ్, నెట్‌వర్కింగ్ మరియు సమిష్టి అభివృద్ధికి బలమైన వేదికను నిర్మించడమే ఫోరమ్ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఆధునిక పరిశ్రమ వ్యవస్థాపకులకు తమ కార్యకలాపాలను విస్తరించుకోవడానికి, ప్రపంచవ్యాప్తంగా నెట్‌వర్క్ చేసుకోవడానికి మరియు డిజిటల్ వ్యాపార వ్యూహాలను అవలంబించడానికి ఆర్యవైశ్య పారిశ్రామికవేత్తల ఫోరమ్‌ను ఉపయోగించుకోవాలని కోరారు. ఆధునిక పరిశ్రమలు స్థాపించి క్షేత్రస్థాయిలో గణనీయమైన యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంతోపాటు దేశ ఆర్థికాభివృద్ధికి కూడా పాటుపడాలని చారుగుండ్ల భవాని సురేష్ కోరారు. ఈ కార్యక్రమంలో ఫోరమ్ ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ పడకంటి, కోశాధికారి శివకుమార్ బొగ్గారి, సంయుక్త కార్యదర్శి వంశీ నేలంటి, ఉపాధ్యక్షులు ఎర్రం బాలకృష్ణ, పూర్వ అధ్యక్షులు రాంబాబు పబ్బిశెట్టి, ఆంధ్రప్రదేశ్ నాయకులు వెంకటేష్ కొల్లిపార, బాలసుబ్రహ్మణ్యం వేముల ఆంధ్ర ప్రదేశ్ ఫోరమ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

---

## ఇంద్రకీలాద్రి దసరా ఉత్సవాలు..
# సీఎం చంద్రబాబుకు ఆహ్వానం

- **అక్టోబర్ 11 నుంచి 20 వరకు ఉత్సవాలు**
- **క్యాంపు కార్యాలయంలో ఆహ్వానపత్రిక అందజేత**
- **సీఎంకు అమ్మవారి ప్రసాదం, వేదాశీర్వచనం**
- **ఉత్సవాల ఏర్పాట్లపై వివరాలు అడిగి తెలుసుకున్న సీఎం**
- **భక్తులకు ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలని ఆదేశం**



విజయవాడ ఇంద్రకీలాద్రిపై ఈ నెల 11 నుంచి 20 వరకు జరగనున్న దసరా మహోత్సవాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఆలయ అధికారులు, ధర్మకర్తల మండలి సభ్యులు ఆహ్వానించారు. ఈ మేరకు క్యాంపు కార్యాలయంలో సీఎంను కలిసి ఆహ్వానపత్రిక అందజేశారు. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవారి ప్రసాదాన్ని అందించి, వేదాశీర్వచనం పలికారు. దసరా ఉత్సవాల ఏర్పాట్లపై చంద్రబాబు ఆరా తీశారు. ఉత్సవాలకు తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దుర్గగుడి ధర్మకర్తల మండలి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ, దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్, ఆలయ ఈవో శీనా నాయక్, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

---

# తిరుపతి నుంచి వారణాసికి 25 బైక్‌లు.. టీడీపీ నేతల సేవా సంకల్ప యాత్ర!

- **సేవా సంకల్ప యాత్రను ప్రారంభించిన పల్లా శ్రీనివాసరావు**
- **తిరుపతి నుంచి వారణాసి వరకు బైక్ యాత్ర**
- **యాత్రలో పాల్గొంటున్న 25 మంది రైడర్లు**
- **టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో యాత్ర నిర్వహణ**
- **నాలుగు రాష్ట్రాల మీదుగా ఎనిమిది రోజుల ప్రయాణం**



ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా జీవితాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా తిరుపతి నుంచి వారణాసి వరకు చేపట్టిన 'సేవా సంకల్ప యాత్ర'ను ఆయన ప్రారంభించారు. 25 మంది బైక్ రైడర్లు ఈ యాత్రలో పాల్గొంటున్నారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబు ఆదేశాలు, మంత్రి నారా లోకేశ్ సూచనల మేరకు టీడీపీ విద్యార్థి విభాగం (టీఎన్ఎస్ఎఫ్) ఆధ్వర్యంలో ఈ యాత్ర నిర్వహిస్తున్నారు. తిరుపతిలోని అలిపిరి నుంచి శ్రీవారి ఆశీస్సులతో ప్రారంభమైన ఈ యాత్ర.. ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్ మీదుగా సాగనుంది. సుమారు ఎనిమిది రోజుల పాటు కొనసాగి అక్టోబర్ 8న వారణాసికి చేరుకోనుంది. ఆయా రాష్ట్రాల్లో భాజపా నాయకులు యాత్రకు స్వాగతం పలకనున్నారు. టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు, యువ నేతలు కూడా ఇందులో పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రజా జీవితంలో నిబద్ధతతో పనిచేసే నాయకత్వానికి నరేంద్ర మోదీ, చంద్రబాబు నాయుడు నిదర్శనమని అన్నారు. సమాజ నిర్మాణం, ప్రజా సేవ కోసం నిరంతరం కృషి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మోదీ నాయకత్వంలో భారత్ ప్రపంచ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు సాధించిందన్నారు. అదే స్ఫూర్తితో ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి, సంక్షేమం, పెట్టుబడుల ఆకర్షణకు కృషి చేస్తున్నామని పల్లా తెలిపారు. ప్రజలకు మెరుగైన పాలన అందించడమే లక్ష్యమని చెప్పారు. మోదీ 25 ఏళ్ల ప్రజా సేవను గుర్తిస్తూ నిర్వహిస్తున్న ఈ యాత్రలో భాగస్వామి కావడం ఆనందంగా ఉందన్నారు. యాత్రలో పాల్గొంటున్న బైక్ రైడర్లకు శుభాకాంక్షలు తెలిపారు.

---

## ఆసియా క్రీడల్లో స్వర్ణం..
# జ్యోతి సురేఖకు మంత్రి అభినందనలు



అమరావతి: ఆసియా భారత మహిళల కాంపౌండ్ ఆర్చరీ జట్టు స్వర్ణం సాధించడంపై ఏపీ క్రీడలశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, శాప్ ఛైర్మన్ రవినాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఫైనల్‌లో చైనాను 238234తో ఓడించి స్వర్ణం సాధించిన భారత జట్టుకు అభినందనలు తెలిపారు. భారత మహిళల ఆర్చరీ జట్టు అద్భుత ప్రదర్శన దేశానికి గర్వకారణమన్నారు. రాష్ట్రానికి చెందిన వెన్నం జ్యోతి సురేఖ 2023, 2026 ఆసియా క్రీడల్లో నాలుగు స్వర్ణ పతకాలు సాధించడంపై ప్రత్యేకంగా అభినందించారు. అంతర్జాతీయ వేదికపై వరుస విజయాలతో జ్యోతి సురేఖ భారత క్రీడా ఖ్యాతిని ఇనుమడింపజేస్తున్నారని రాంప్రసాద్ రెడ్డి, రవినాయుడు కొనియాడారు. భవిష్యత్ పోటీల్లోనూ భారత క్రీడాకారులు మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

---

## కామన్వెల్త్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో
# చంద్రకళ పతకం గెలవడం అభినందనీయం: కొల్లు రవీంద్ర

- **కామన్వెల్త్ పోటీల్లో సత్తా చాటిన ఎక్సైజ్ కానిస్టేబుల్ చంద్రకళ**
- **చంద్రకళను అభినందించిన ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర**
- **పథకాలు సాధించే క్రీడాకారులకు ప్రభుత్వం అండగా ఉంటుందని వ్యాఖ్య**



అంతర్జాతీయ క్రీడా వేదికలపై ఆంధ్రప్రదేశ్ క్రీడాకారులు తమ సత్తా చాటారు. కెనడాలో జరిగిన కామన్వెల్త్ పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో రజత పతకం సాధించిన రాష్ట్ర ఎక్సైజ్ కానిస్టేబుల్ చంద్రకళను గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర బుధవారం సత్కరించారు. మరోవైపు, ఏషియన్ గేమ్స్‌లో ఏపీకి చెందిన స్టార్ ఆర్చర్ వెన్నం జ్యోతి సురేఖ స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుని రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, క్రీడాకారుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఒలింపిక్స్‌లో ఏపీ అథ్లెట్లు పతకాలు సాధించేలా వారికి అన్ని విధాలా మద్దతు అందిస్తున్నామని తెలిపారు. క్రీడల్లో రాణించిన వారికి ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పిస్తూ అండగా నిలుస్తున్నామని, ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. కామన్వెల్త్ 75 కేజీల విభాగంలో చంద్రకళ రజతం గెలవడం అభినందనీయమని రఆయన కొనియాడారు. ఇదే సమయంలో, జపాన్‌లో జరుగుతున్న ఏషియన్ గేమ్స్ 2026లో భారత మహిళల కాంపౌండ్ ఆర్చరీ జట్టు స్వర్ణ పతకాన్ని గెలుచుకుంది. ఫైనల్లో చైనాపై 238234 స్కోరు తేడాతో విజయం సాధించింది. ఈ జట్టులో ఏపీకి చెందిన వెన్నం జ్యోతి సురేఖ కీలక పాత్ర పోషించారు. ఆమెతో పాటు చికిత తనపర్తి, ప్రతిక ప్రదీప్ సభ్యులుగా ఉన్నారు. జ్యోతి సురేఖకు ఇది ఏషియన్ గేమ్స్‌లో నాలుగో స్వర్ణం కావడం విశేషం. ఈ విజయాలు రాష్ట్రానికి, దేశానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చిపెట్టాయి.

---

## మహిళలకు ఏసీ బస్సుల్లోనూ
# ఉచిత ప్రయాణం: చంద్రబాబు



తమ ప్రభుత్వం 120 ఏళ్ల నాటి ఇళ్ల స్థలాల పట్టాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. విజయవాడలోని మకినేని బసవపున్నయ్య స్టేడియంలో నిర్వహించిన 'పేదలకు పట్టాభిషేకం' కార్యక్రమంలో ఆయన లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సొంత ఇల్లు అనేది పేదల జీవితకాల స్వప్నమని, దీని కోసం 40 నుంచి 50 ఏళ్లుగా ఎదురుచూస్తున్న వారు ఎందరో ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 26,401 మంది అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను అందజేశారు. ఎన్టీఆర్ జిల్లాలో లబ్ధిదారులకు సగటున 130 గజాల స్థలానికి పట్టాలు అందించినట్లు చెప్పారు. ఇది పేదల ఆత్మగౌరవానికి కట్టబెట్టిన పట్టాభిషేకమని, వారి చిరకాల వాంఛను నెరవేర్చామని పేర్కొన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందని, కేంద్ర ప్రభుత్వ సహకారంతో డబుల్ ఇంజన్ సర్కార్ ఇప్పుడు జెట్ స్పీడ్‌తో అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తోందని చంద్రబాబు అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని దశలవారీగా అమలు చేస్తున్నామని, కూటమి ప్రభుత్వం ప్రతీ పేదవాడికి న్యాయం చేసేందుకు అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. ఇప్పటివరకు విశాఖ, మంగళగిరి, విజయవాడ కార్యక్రమాలతో కలిపి సుమారు 60,000 పట్టాలు పంపిణీ చేశామని, వాటి విలువ సుమారు రూ.52,000 కోట్లు ఉంటుందని వివరించారు. లబ్ధిదారులు ఈ ఆస్తిని అమ్ముకోవద్దని, భవిష్యత్ కోసం కాపాడుకోవాలని సూచించారు. మహిళల కోసం 'స్త్రీ శక్తి' పథకం కింద ఉచిత బస్సు ప్రయాణాన్ని అమలు చేస్తున్నామని, భవిష్యత్తులో ఏసీ బస్సులను కూడా కొనుగోలు చేసి వాటిలోనూ ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు.

---

# 'బాబాయ్ హత్యతో అబ్బాయికే లాభం'.. జగన్ మౌనంపై నిమ్మల ప్రశ్నలు



వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితుడు సునీల్ యాదవ్ ఇచ్చిన వాంగ్మూలంపై మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎందుకు స్పందించడం లేదని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ప్రశ్నించారు. వివేకా హత్యతో అంతిమంగా లబ్ధి పొందింది జగన్, ఆయన కుటుంబ సభ్యులు, అవినాష్‌రెడ్డి అని సునీల్ యాదవ్ చెప్పినట్లు మంత్రి పేర్కొన్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో నిమ్మల మాట్లాడారు. సునీల్ యాదవ్ కోర్టులో తనకు ప్రాణహాని ఉందని చెప్పినా తాడేపల్లి ప్యాలెస్ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. తనను కాకుండా అంతిమ లబ్ధిదారులైన జగన్, అవినాష్‌రెడ్డి కుటుంబ సభ్యులను విచారిస్తే అసలు విషయాలు బయటకు వస్తాయని సునీల్ చెప్పినట్లు తెలిపారు. వివేకా హత్య కేసుతో సంబంధం ఉన్న పలువురు కీలక వ్యక్తులు అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందడంపైనా మంత్రి ప్రశ్నలు లేవనెత్తారు. కసనూరు శ్రీనివాస్‌రెడ్డి, ఈసీ గంగిరెడ్డి, కువైట్ గంగాధర్‌రెడ్డి, డ్రైవర్ నారాయణ, వైఎస్ అభిషేక్‌రెడ్డి, వాచ్‌మెన్ రంగయ్య తదితరుల మరణాలపై సమాధానాలు రావాల్సి ఉందన్నారు. హత్యకు రూ.40 కోట్ల సుపారీ ఇచ్చినట్లు వచ్చిన అంశాన్ని కూడా నిమ్మల ప్రస్తావించారు. అంత పెద్ద మొత్తాన్ని ఇచ్చే ఆర్థిక సామర్థ్యం ఎర్ర గంగిరెడ్డి, శివశంకర్‌రెడ్డికి లేదని.. రాజకీయంగా లబ్ధి పొందిన జగన్ కుటుంబానికే ఆ సామర్థ్యం ఉందని ఆరోపించారు. సుపారీకి సంబంధించిన నగదులో రూ.40 లక్షలను ఈడీ అటాచ్ చేసిందని చెప్పారు. హత్య జరిగిన రోజు తెల్లవారుజామునే వివేకానందరెడ్డి చనిపోయిన విషయం జగన్‌కు తెలిసినా.. సాయంత్రం వరకు పులివెందుల వెళ్లకుండా హైదరాబాద్‌లో ఎందుకు ఉన్నారని మంత్రి ప్రశ్నించారు. నాటి ముఖ్య సలహాదారు అజయ్ కల్లాం సీబీఐకి ఇచ్చిన వాంగ్మూలాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఘటనాస్థలంలో రక్తపు మరకలను తొలగించి, గుండెపోటుగా ప్రచారం చేయడం ద్వారా ఆధారాలను మార్చేందుకు ప్రయత్నించారని నిమ్మల ఆరోపించారు. గతంలో సీబీఐ దర్యాప్తు కోరిన జగన్.. ముఖ్యమంత్రి అయ్యాక విచారణను అడ్డుకునే ప్రయత్నం చేశారని విమర్శించారు. దస్తగిరి, సునీల్ యాదవ్ వాంగ్మూలాలు, దర్యాప్తు సంస్థల నివేదికలు, గూగుల్ టేక్‌అవుట్ ఆధారాలు, ఈడీ అటాచ్‌మెంట్లు కేసులో కీలకంగా ఉన్నాయని మంత్రి అన్నారు. నిందితులు తనపై ఆరోపణలు చేస్తున్నా జగన్ స్పందించకపోవడం ప్రజల్లో అనుమానాలు పెంచుతోందని పేర్కొన్నారు. ఇప్పటికైనా వివేకా హత్యపై జగన్ ప్రజలకు సమాధానం చెప్పాలని నిమ్మల డిమాండ్ చేశారు.

---

# మరో వివాదంలో కొలికపూడి శ్రీనివాసరావు.. పల్లాకు బాలకోటయ్య ఫిర్యాదు

ఎన్టీఆర్ జిల్లా తిరువూరు టీడీపీ ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు మరోసారి వివాదంలో చిక్కుకున్నారు. ఒక పీఈటీ టీచర్‌ను ఇంటికి పిలిపించి, దుర్భాషలాడటమే కాకుండా కర్రతో దాడి చేశారంటూ ఆయనపై ఫిర్యాదు అందింది. ఈ మేరకు రాష్ట్ర సాంఘిక సంక్షేమ బోర్డు ఛైర్మన్ పోతుల బాలకోటయ్య... టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం, విస్సన్నపేట మండలం నరసాపురం జెడ్పీహెచ్ స్కూల్‌లో పీఈటీగా పనిచేస్తున్న మేరుగు రమేశ్‌ను సెప్టెంబర్ 25న సాయంత్రం 6.30 గంటలకు డిప్యూటీ డీఈవో ద్వారా ఎమ్మెల్యే తన నివాసానికి పిలిపించుకున్నారు. అదే సమయంలో పాఠశాల హెడ్మిస్ట్రెస్ శోభలతను కూడా పిలిపించి దుర్భాషలాడినట్టు ఫిర్యాదులో తెలిపారు.

# 'గజ్వేల్ గడీ' తర్వాత ఇప్పుడు 'సిరిసిల్ల గడీ'ని కూలుస్తాం.. రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

- **కేటీఆర్‌పై సీఎం రేవంత్ తీవ్ర విమర్శలు**
- **సిరిసిల్లకు రూ.1,500 కోట్ల కేటాయింపు**
- **కాంగ్రెస్ నేతకు మంత్రి పదవి హామీ**
- **బతుకమ్మ చీరలపై కమీషన్ల ఆరోపణలు**
- **దళితుల అంశంలో బీఆర్ఎస్‌పై విమర్శలు**

సిరిసిల్లలో జరిగిన బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి బీఆర్ఎస్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఉద్దేశించి ఘాటు వ్యాఖ్యలు చేశారు. గతంలో గజ్వేల్ గడీని కూల్చుతామని చెప్పి చేసి చూపించామని, ఇప్పుడు సిరిసిల్ల గడీని కూడా నేలమట్టం చేద్దామని సిరిసిల్ల ప్రజలకు పిలుపునిచ్చారు. కేటీఆర్‌పై వ్యక్తిగత వ్యాఖ్యలు చేస్తూ.. 'పిల్లకాకికి ఏం తెలుసు ఉండేలు దెబ్బ' అంటూ రేవంత్ రెడ్డి మండిపడ్డారు. తన విలువ ఏంటో ఫామ్‌హౌస్‌లో పడుకున్న వారి అయ్యను అడిగితే తెలుస్తుందని అన్నారు. గత రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనలో సిరిసిల్ల అభివృద్ధికి రూ.1,500 కోట్లు కేటాయించామని సీఎం తెలిపారు. సిరిసిల్ల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేసే నాయకుడిని భవిష్యత్తులో మంత్రిని చేస్తామని ప్రకటించారు. కాంగ్రెస్‌లో సామాజిక న్యాయానికి ప్రాధాన్యం



ఇస్తున్నామని చెబుతూ.. తాను సీఎం అయిన తర్వాత సీతక్క వంటి సామాన్యులకు మంత్రి పదవులు దక్కాయని పేర్కొన్నారు.

**బతుకమ్మ చీరల్లోనూ కమీషన్లే**

బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో ప్రజలకు ఒరిగిందేమీ లేదని సీఎం విమర్శించారు. టీవీలు, పేపర్లు, స్టార్ హోటళ్లు, ఫామ్‌హౌస్‌లు మాత్రమే సంపాదించుకున్నారని ఆరోపించారు. కరీంనగర్ కలెక్టరేట్‌ను ఇప్పటివరకు ఎందుకు పూర్తి చేయలేదని కేటీఆర్‌ను ప్రశ్నించారు. టెండర్లు దక్కించుకుని కమీషన్లు తీసుకున్నారని, చివరకు బతుకమ్మ చీరల తయారీలోనూ కమీషన్లు తీసుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 'పుట్టింటి సారె' పేరుతో ఆడబిడ్డలకు నాణ్యమైన చీరలు అందిస్తున్నామని తెలిపారు. సంక్షేమం, అభివృద్ధిని సమపాళ్లలో కొనసాగిస్తున్నామని చెప్పారు.

**దళితులపై చిన్నచూపా?**

అసెంబ్లీలో స్పీకర్‌ను దూషించి అవమానించిన ఘనత బీఆర్ఎస్ నాయకులదేనని రేవంత్ రెడ్డి విమర్శించారు. ఎర్రవల్లిలో దళితులు డప్పు కొడితే ఆ ప్రాంతాన్ని పసుపు నీళ్లతో కడిగి అణగదొక్కారని ఆరోపించారు. దళితులంటే బీఆర్ఎస్‌కు అంత చిన్నచూపా అని ప్రశ్నించారు. ఎర్రవల్లి భూముల ఆక్రమణలతో పాటు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, సంతోష్‌రావుల అక్రమాస్తులపై లెక్కలు తేలుస్తున్నామని సీఎం అన్నారు. 'ఎట్ హోమ్', 'దక్కన్ స్టార్ హోటల్స్' పేరుతో ఉన్న ఆస్తులు వారి పేర్లకు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. అసెంబ్లీలో సమయం లేక కొన్ని విషయాలు చెప్పలేకపోయామని, త్వరలో 'పార్ట్ 2'లో అన్ని వివరాలు బయటపెడతామని ప్రకటించారు.

## రాజస్థాన్‌తో చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేయాలి: హరీశ్‌రావు

హైదరాబాద్: సింగరేణి ఆధ్వర్యంలోని జైపూర్ విద్యుత్ విషయంలో రాజస్థాన్‌తో చేసుకున్న ఒప్పందాన్ని వెంటనే రద్దు చేసుకోవాలని మాజీమంత్రి హరీశ్‌రావు(Harish Rao) డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి(Revanth Reddy)కి లేఖ రాశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి విద్యుత్ వ్యవస్థ నిర్వహణలో పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. ఒకవైపు కరెంటు లేక రైతుల పంటలు కళ్లెదుటే ఎండిపోతుంటే, మరోవైపు మన రాష్ట్రంలో తక్కువ ఖర్చుతో ఉత్పత్తయ్యే విద్యుత్‌ను ఇతర రాష్ట్రాలకు ధారాదత్తం చేసేందుకు సిద్ధపడటం ప్రజా వ్యతిరేక చర్య కాక మరేమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. "మంచిర్యాల జిల్లా జైపూర్ మండలంలోని



సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌కు కావాల్సిన బొగ్గు మన సింగరేణి గనుల్లోనే ఉంది... నడపడానికి కావాల్సిన నీళ్లు పక్కనే ఉన్న గోదావరి నుంచే పుష్కలంగా అందుతాయి. బొగ్గు మనది, నీళ్లు మనవి, స్థలం మనది... అలాంటప్పుడు ఇక్కడ కొత్తగా చేపడుతున్న విస్తరణలో 800 మెగావాట్ల విద్యుత్‌ను రాజస్థాన్‌కు కట్టబెట్టేలా జాయింట్ వెంచర్ ఒప్పందం చేసుకోవడం వెనుక ఆంతర్యం ఏమిటి? మన బొగ్గు, మన నీళ్లు, మన ప్రాంతంలో తయారయ్యే కరెంటుపై హక్కు తెలంగాణదే కదా. ఇటీవల సింగరేణి సంస్థ రాజస్థాన్‌కు చెందిన ఆర్ఆర్వీయూఎన్ఎల్ విద్యుత్ సంస్థతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం కొత్తగా నిర్మించే థర్మల్ విద్యుత్‌లో 800 మెగావాట్లు రాజస్థాన్‌కు కేటాయిస్తారు'' అని హరీశ్‌రావు లేఖలో పేర్కొన్నారు.. తెలంగాణ ప్రజల ఆస్తి సింగరేణి... అలాంటి సింగరేణి విద్యుత్‌ను, పెట్టుబడిని రాజస్థాన్ అభివృద్ధికి ఎందుకు మళ్లించాలని ప్రశ్నించారు. మన రాష్ట్రమే కరెంటు లేక అల్లాడుతున్న వేళ ఈ తొందరపాటు నిర్ణయం ఎందుకని ప్రశ్నించారు. రైతులకు 24 గంటల విద్యుత్ ఇస్తున్నామని చెప్పి కనీసం 7..8 గంటలు కూడా ఇవ్వలేకపోతున్నారని విమర్శించారు.

## పేరు మార్చినంత మాత్రాన సిద్ధాంతం, నాయకత్వం మారదు: కేటీఆర్

- **తెలుగు గడ్డపై పుట్టిన పార్టీ జాతీయ స్థాయికి ఎందుకు విస్తరించకూడదన్న కేటీఆర్**
- **నా పేరు షారుఖ్ ఖాన్ అని పెట్టుకుంటే షారుఖ్ అవుతానా? అని ప్రశ్న**
- **తదుపరి సీఎం కేసీఆర్ అని ధీమా**

పార్టీ పేరును టీఆర్ఎస్ నుంచి బీఆర్ఎస్‌గా మార్చినంత మాత్రాన తమ సిద్ధాంతం, ఆలోచనా విధానం, నాయకత్వం మారబోవని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. "నా పేరు షారుఖ్ ఖాన్ అని పెట్టుకుంటే నేను షారుఖ్ ఖాన్ అయిపోతానా?" అని ఆయన ప్రశ్నించారు. ఇండియా టుడే కాన్‌క్లేవ్‌లో మాట్లాడిన ఆయన, పార్టీ పేరు మార్పుపై వివరణ ఇచ్చారు. తెలుగు సినిమాలు పాన్‌ఇండియా స్థాయిలో విజయం సాధిస్తున్నప్పుడు, తెలుగు గడ్డపై పుట్టిన రాజకీయ పార్టీ కూడా జాతీయ స్థాయిలో ఎందుకు విస్తరించకూడదని కేటీఆర్ అన్నారు. తెలంగాణలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను దేశంలోని ఇతర ప్రాంతాలకు విస్తరించాలనే ఉద్దేశంతోనే పార్టీ పేరు మార్చామని తెలిపారు. రెండేళ్లలో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని, కాంగ్రెస్ పాలనపై ప్రజలు పూర్తిగా విసిగిపోయారని ఆయన జోస్యం చెప్పారు. తదుపరి సీఎం కేసీఆరేనని, తాను కాదని ప్రజలు



కోరుకుంటున్నారని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ, కాంగ్రెస్‌లపై కేటీఆర్ విమర్శలు గుప్పించారు. మత ప్రాతిపదికన దేశాన్ని విభజించేందుకు బీజేపీ కుట్ర చేస్తోందని ఆరోపించారు. ప్రజలు పూజించే రాముడు, శివుడి మధ్య తేడాలు సృష్టించేందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని అన్నారు. ఉద్యోగాల కల్పన, ఎన్నికల హామీల అమలు వంటి ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించడమే ఈ రెండు జాతీయ పార్టీల విధానమని విమర్శించారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఎన్నికల సంఘం విశ్వసనీయతపై తీవ్రమైన సందేహాలు తలెత్తుతున్నాయని కేటీఆర్ అన్నారు. ఈసీ పనితీరుపై ఇటీవల ఓ జాతీయ మీడియా చేసిన పరిశోధనలో వెల్లడైన అంశాలు నిజమేనని చాలామంది నమ్ముతున్నారని, దీనిపై సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర ప్రజా వ్యతిరేకత ఉందని, అయితే ప్రధాన ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ యువతతో కలిసి నడవడంలో విఫలమయ్యారని విమర్శించారు.

## కాంగ్రెస్ పార్టీలోకి జగన్ చేరుతారంటూ ప్రచారం జరుగుతున్న వేళ..
## మల్లు భట్టి కీలక వ్యాఖ్యలు!

- **జగన్, మమత, పవార్ కాంగ్రెస్‌లోకి తిరిగి రావాలన్న మల్లు భట్టి**
- **కాంగ్రెస్‌ను వీడిన వారంతా వెనక్కి రావాలని పిలుపు**
- **సీఎం రేవంత్‌తో తనకు ఎలాంటి విభేదాలు లేవని స్పష్టీకరణ**
- **నేతలను కులం కోణంలో చూడకూడదని వ్యాఖ్య**
- **గ్యారెంటీ పథకాలు ఉచితాలు కావన్న డిప్యూటీ సీఎం**

వైసీపీ అధినేత జగన్ తిరిగి కాంగ్రెస్ పార్టీలోకి చేరే అవకాశాలున్నాయంటూ పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలు ఆసక్తిని రేపుతున్నాయి. జగన్, మమతా బెనర్జీ, శరద్ పవార్ వంటి కాంగ్రెస్ పార్టీ మాజీ నేతలు తిరిగి సొంత గూటికి రావాలని ఆయన పిలుపునిచ్చారు. వారంతా పార్టీలోకి వస్తే అందరికంటే తానే ఎక్కువ సంతోషిస్తానని అన్నారు. కొచ్చిలో జరిగిన ఇండియా టుడే కాన్‌క్లేవ్ సౌత్ 2026లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డితో కలిసి పనిచేసిన విషయాన్ని గుర్తు చేసుకున్న భట్టి... జగన్‌తో నేరుగా పనిచేయకపోయినా, పాత నేతలంతా తిరిగి వస్తే దేశాన్ని, పార్టీ సిద్ధాంతాలను బలోపేతం చేసినవారవుతారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో తనకు ఎలాంటి విభేదాలు లేవని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. నేతలను కులం కోణంలో చూడకూడదని, తామిద్దరం ఐక్యంగా, సమష్టి నిర్ణయాలతో ప్రభుత్వాన్ని నడుపుతున్నామని వివరించారు. ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వంపై భట్టి తీవ్ర విమర్శలు చేశారు. తాము చెల్లించే ప్రతి రూపాయి పన్నుకు బదులుగా తెలంగాణకు కేవలం 43 పైసలు మాత్రమే తిరిగి వస్తున్నాయని ఆరోపించారు. దక్షిణాది రాష్ట్రాలపై కేంద్రం వివక్ష చూపుతోందని, సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీస్తోందని మండిపడ్డారు. ఇదే సమయంలో, ఓటర్ల జాబితా



సవరణలో అక్రమాలు జరుగుతున్నాయని, ఇది బీజేపీకి లబ్ధి చేకూర్చేలా ఉందని ఆరోపిస్తూ... చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న గ్యారెంటీ పథకాలను ఆయన సమర్థించుకున్నారు. ఇవి ఉచితాలు కావని, పేదలకు ఆత్మగౌరవాన్ని ఇచ్చి, వారి కొనుగోలు శక్తిని పెంచడం ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే చర్యలని స్పష్టం చేశారు.



## సున్నం చెరువు, తమ్మిడికుంట
## అభివృద్ధిపై హైడ్రా ఫోకస్

- **పనులను పరిశీలించిన కమిషనర్ రంగనాథ్**
- **పరిసరాలను సుందరంగా తీర్చిదిద్దాలని ఆదేశం**

సున్నం చెరువుతో పాటు తమ్మిడికుంట పరిసరాలను మరింత సుందరంగా తీర్చిదిద్దాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అధికారులను ఆదేశించారు. చెరువుల్లో పూడిక పూర్తిస్థాయిలో తొలగించి లోతు పెంచిన తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. చెరువుల చుట్టూ చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మంగళవారం క్షేత్రస్థాయిలో సున్నం చెరువు, తమ్మిడికుంట పరిసరాలను పరిశీలించిన కమిషనర్.. చెరువుల చుట్టూ బలమైన ఫెన్సింగ్, పాత్‌వే, గ్రీనరీ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. దసరా పండుగ రోజుల్లో ఈ రెండు చెరువులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్న నేపథ్యంలో అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. సున్నం చెరువు ఇన్‌లెట్ కాలువతో పాటు అక్కడ కల్వర్టు నిర్మించి రహదారి పనులను వెంటనే పూర్తి చేయాలని హైడ్రా కమిషనర్ ఆదేశించారు. గాయత్రినగర్, బోరబండ ప్రాంతాల నుంచి చెరువుకు వచ్చే మార్గాలను కూడా అభివృద్ధి చేయాలని సూచించారు. చెరువు అభివృద్ధితో పాటు పరిసర ప్రాంతాలను సైతం సుందరంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. సున్నం చెరువును ఆనుకుని ఉన్న ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధి పనులను కూడా కమిషనర్ పరిశీలించారు. ఒకప్పటి సున్నం చెరువుకు, ప్రస్తుతం కనిపిస్తున్న చెరువుకు ఎంతో మార్పు వచ్చిందని స్థానికులు హైడ్రా కమిషనర్‌ను కలిసి అభినందించారు. చెరువులో పూర్తిస్థాయిలో నీరు ఉంటే మరింత నయనమనోహరంగా కనిపించేదని పేర్కొన్నారు. పలు ఆటంకాలను అధిగమించి చెరువును సుందరంగా తీర్చిదిద్దినందుకు హైడ్రాను అభినందించారు. ఎన్ కన్వెన్షన్‌ను తొలగించి తమ్మిడికుంటను అభివృద్ధి చేసిన తీరును కూడా పలువురు ప్రశంసించారు. త్వరలో ప్రారంభానికి సిద్ధం చేస్తున్న సున్నం చెరువు, తమ్మిడికుంట వద్ద చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్, సీఎంసీ కమిషనర్ సృజన సమీక్షించారు.

## ఫైళ్లు, విధులతో పాటు క్రీడలు, కళలపై ఆసక్తిని పెంచుకోవాలి: మంత్రి

ఉద్యోగులకు విధులతో పాటు క్రీడలు, కళలు, సాంస్కృతిక కార్యక్రమాలపై దృష్టి సారించాలని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు కోరారు. పని సామర్థ్యంతో పాటు శారీరక, మానసిక ఆరోగ్యం కూడా ముఖ్యమని చెప్పారు. డా.బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సచివాలయ సాంస్కృతిక ఉత్సవానికి స్పెషల్ సీఎస్ మహేష్ దత్ హెక్కాతో పాటు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడారు. ఉద్యోగులు నిత్యం ఎంతో బిజీగా, పని ఒత్తిడితో విధులు నిర్వర్తిస్తుంటారని తెలిపారు. క్రీడలు, కళలు, సాహిత్యం, సంగీతం, నృత్యం మనసుకు శారీరక, మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయన్నారు. సచివాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బందిలో దాగి ఉన్న కళా ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. ఉద్యోగులు కేవలం ఫైళ్లు, విధులు, బాధ్యతలకే పరిమితం కాకుండా తమలోని సృజనాత్మకతను కూడా వెలికితీయాలని సూచించారు. గెలుపు, ఓటమి కంటే కార్యక్రమాల్లో పాల్గొనడం, తమ ప్రతిభను ప్రదర్శించడం, సహోద్యోగులతో కలిసి ఆనందాన్ని పంచుకోవడం ముఖ్యమని చెప్పారు. ఉద్యోగుల్లో ఉత్సాహాన్ని పెంచేందుకు తరచుగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకోవాలని జూపల్లి సూచించారు. ఉద్యోగులు బాగా పనిచేస్తే దాని ప్రభావం ప్రభుత్వ పనితీరు, ప్రజలకు అందే సేవలపై ఉంటుందని అన్నారు. విధులతో పాటు ఆటలు, క్రీడలు, పాటలపై ఆసక్తి పెంచుకోవడం వల్ల ఉద్యోగుల్లో కొత్త ఉత్సాహం వస్తుందని పేర్కొన్నారు. దేశానికి



ఎంతో ప్రాచీనమైన సంస్కృతి, సంప్రదాయాలు, కళలు ఉన్నాయని మంత్రి తెలిపారు. విదేశాల్లో స్థిరపడిన భారతీయులు సైతం తమ పిల్లలకు భారతీయ కళలు, సంస్కృతిని నేర్పిస్తున్నారని గుర్తుచేశారు. ఉద్యోగ బాధ్యతలను నిర్వర్తిస్తూనే మన పూర్వీకులు అందించిన కళలు, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు.

**అప్పుడు పాటలే నాకు స్ఫూర్తి**

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమాన్ని మంత్రి గుర్తు చేసుకున్నారు. 2011లో ఎమ్మెల్యే, మంత్రి పదవులకు రాజీనామా చేసి ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం పాదయాత్ర చేపట్టిన సమయంలో ఆటపాటలే తనకు ఎంతో స్ఫూర్తినిచ్చాయని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం సిద్ధించి ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని ఎంతో మంది ప్రాణత్యాగాలు చేశారని అన్నారు. వారి త్యాగాలను స్మరించుకుంటూ వారి అడుగుజాడల్లో నడవాలని ఆకాంక్షించారు. ఉద్యోగుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. ఉద్యోగులు చేపట్టే సాంస్కృతిక కార్యక్రమాలకు సాంస్కృతిక శాఖ తరఫున అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంగీత దర్శకుడు రాధాకృష్ణ, తెలంగాణ సచివాలయ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు గిరి శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి జే. ప్రేమ్, ఉపాధ్యక్షుడు నవీన్‌కుమార్, కల్చరల్ సెక్రటరీ యామిని కనకతార తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్ కట్టినవాటికి రేవంత్ రిబ్బన్లు కట్ చేస్తున్నారు: కౌశిక్ రెడ్డి

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈరోజు ఆయన మీడియాతో మాట్లాడుతూ... రేవంత్ రెడ్డి ఒక 'రిబ్బన్ కటింగ్ సీఎం' అంటూ ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిర్మించిన కట్టడాలకే రేవంత్ రెడ్డి రిబ్బన్లు కత్తిరిస్తున్నారని ఆరోపించారు. "కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తానని చెప్పిన రేవంత్, ఇప్పుడు ఆయన కట్టిన వాటినే ప్రారంభిస్తున్నారు. కరీంనగర్ కలెక్టరేట్ కేసీఆర్ ఆనవాళ్లు కాదా?" అని కౌశిక్ రెడ్డి ప్రశ్నించారు. సిరిసిల్లలో కాంగ్రెస్ ఏర్పాటు చేసిన సభకు ప్రజల నుంచి స్పందన లేదని అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి ఆయన ఓ సవాల్ విసిరారు. సిరిసిల్లలో ఎమ్మెల్యే కేటీఆర్ చేసిన అభివృద్ధిలో కనీసం 10 శాతం అయినా తన సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లో చేసి చూపించాలని అన్నారు. ముఖ్యమంత్రి సొంత గ్రామంలోనే కరెంట్ సరఫరా సరిగా లేదని ఎద్దేవా చేశారు.

## ఆసియా క్రీడల్లో ఆర్చర్ చికితకు ఒకేరోజు రెండు స్వర్ణాలు.. సీఎం రేవంత్ రెడ్డి

ఆసియా క్రీడల్లో ఒకే రోజు రెండు స్వర్ణ పతకాలు సాధించి సత్తా చాటిన తెలంగాణ ఆర్చరీ క్రీడాకారిణి తానిపర్తి చికితా రావును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. తన అద్భుత విజయంతో చికిత తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచిందని, రాష్ట్ర ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసిందని కొనియాడారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేస్తూ, చికిత పట్టుదల, నిరంతర సాధన, దృఢ సంకల్పం యువ క్రీడాకారులకు ఎంతో స్ఫూర్తినిస్తాయని పేర్కొన్నారు. ఆమె ప్రతిభను గుర్తించి వెన్నంటి నిలిచిన తల్లిదండ్రులకు, శిక్షణ ఇచ్చిన కోచ్‌లకు కూడా ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ప్రత్యేక అభినందనలు తెలిపారు. పెద్దపల్లి జిల్లాకు చెందిన చికిత.. ఆసియా క్రీడల్లో కాంపౌండ్ ఉమెన్స్ టీమ్, మిక్స్‌డ్ టీమ్ విభాగాల్లో స్వర్ణ పతకాలను కైవసం చేసుకుంది. ముఖ్యంగా, మిక్స్‌డ్ టీమ్‌లో తన భాగస్వామి సాహిల్ జాదవ్‌తో కలిసి సాధించిన ఈ విజయంతో ఆమె 2028 లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించడం విశేషం.

# ఈసీ అక్రమాలపై ఐక్యంగా పోరాడతాం: ఇండియా కూటమి

కేంద్ర ఎన్నికల సంఘం తీరుకు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా నిరసనలు, మార్చ్ చేపట్టాలని 'ఇండియా కూటమి' నేతలు నిర్ణయించారు. బుధవారం జరిగిన సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అక్టోబర్ 2నుంచి 8వరకు వారం రోజుల పాటు 'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి' అనే నినాదంతో పాదయాత్ర చేపట్టనున్నట్టు ప్రకటించారు. అక్టోబర్ 6న ఈసీ (EC) కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి నిరసన తెలియజేస్తామన్నారు. అక్టోబర్ రెండో వారంలో రాష్ట్రపతిని కలిసేందుకు అపాయింట్‌మెంట్ కోరనున్నట్లు వెల్లడించారు. కేంద్ర దర్యాప్తు సంస్థలను, ఎన్నికల సంఘాన్ని భాజపా నేతలు ఏ రకంగా స్వాధీనం




చేసుకుంటున్నారో రాష్ట్రపతికి వివరించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కేంద్రం, ఎన్నికల కమిషన్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. 'ఎన్నికల్లో జరుగుతున్న అక్రమాలపై మేమంతా (ఇండియా కూటమి నేతలు) ఐక్యంగా పోరాడతాం. అధికారం కోసం మోదీ, అమిత్ షా ఈసీని ఓ రబ్బర్ స్టాంపులా వినియోగిస్తున్నారు. ఓటర్ జాబితాలో అవకతవకలను ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆధారాలతో చూపించినా ఈసీ పట్టించుకోలేదు. ఈవీఎంల పనితీరుపై ఎంతో కాలంగా సమాధానం కోరుతున్నా స్పందించ లేదు. ఇకపై ఈవీఎంల స్థానంలో బ్యాలెట్ పేపర్లు తీసుకురావాలి. సర్ ప్రక్రియకు ముందున్న ఓటర్ల జాబితానే ఎన్నికల సమయంలో పరిగణలోకి తీసుకోవాలి' అని డిమాండ్ చేశారు.

*** వారికి తగిన శిక్ష పడాల్సిందే: రాహుల్ గాంధీ**

తమ స్వలాభం కోసం దేశంలోని ప్రజాస్వామ్యాన్ని నాశనం చేసిన వారికి తగిన శిక్ష పడాల్సిందేనని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. 'వారు ఎంత పెద్దవారైనా తప్పు చేస్తే శిక్ష అనుభవించాల్సిందే. భారత ప్రజాస్వామ్యం ఈ దేశంలోని ప్రతి ఒక్కరి కన్నా ఎంతో గొప్పది. ఎన్నికల్లో అవకతవకలు జరిగాయని మేం చెప్పే మాటలు నిజమేనని ఇప్పుడు ప్రజలకు కూడా తెలిసింది. ఈ ప్రభుత్వ అవినీతిని వారే ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సీఈసీ జ్ఞానేశ్ కుమార్ (Gyanesh Kumar) తన తప్పు ఒప్పుకొని, పదవికి రాజీనామా చేయాలి. ఆయన పదవి నుంచి వైదొలగకపోతే ఆందోళన మరింత తీవ్రతరం చేస్తాం' అని రాహుల్ గాంధీ హెచ్చరించారు. బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సైతం జ్ఞానేశ్ కుమార్‌పై విమర్శలు గుప్పించారు. ఇండియా కూటమి సమావేశంలో విపక్ష పార్టీలకు చెందిన పలువురు అగ్రనేతలు పాల్గొన్నారు.

## బేబీ ఫుడ్ ఉత్పత్తుల ప్యాకెట్లపై తల్లీబిడ్డల ఫొటోలు వాడొద్దు: తుకారాం ముండే

బేబీ ఫుడ్ ఉత్పత్తుల ప్యాకెట్లపై.. తల్లీబిడ్డల ఫొటోలు ముద్రించొద్దని మహారాష్ట్ర ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ ఆదేశించింది. ఫార్ములా పాలు, రెండేళ్లలోపు పిల్లల కోసం తయారు చేసే అన్ని ఆహార ఉత్పత్తులకు ఈ నిబంధనలు వర్తిస్తాయని తెలిపింది. ప్యాకెట్లపై 'తల్లి పాలు శ్రేష్ఠం' అనే సందేశాన్ని తప్పనిసరిగా ముద్రించాలని స్పష్టం చేసింది. ఆరు నెలలు దాటిన శిశువులకు మాత్రమే వీటిని అనుబంధ ఆహారంగా ఇవ్వాలని సూచించింది. "ఆరు నెలలు నిండిన చిన్నారులకు ఇచ్చే ఆహారంపై 'వైద్యుల సూచన



మేరకే ఉపయోగించాలి' అని ప్యాకెట్లపై స్పష్టంగా రాసి ఉండాలి. ఉచిత నమూనాలు, డిస్కౌంట్ కూపన్ల ద్వారా ప్రచారం చేయొద్దు. తల్లిపాల ప్రాధాన్యాన్ని పెంచడం, శిశువులకు సరైన పోషకాహారం అందించడమే మా లక్ష్యం" అని ఎఫ్‌డీఏ (FDA) కమిషనర్ తుకారాం ముండే తెలిపారు.

*** దోశలో ఎలుక.. హోటల్ లైసెన్స్ సస్పెండ్**

దోశలో చనిపోయిన ఎలుక కనిపించడంతో ఓ వ్యక్తి వాంతులు చేసుకున్న ఘటనపై ఎఫ్‌డీఏ చర్యలు చేపట్టింది. ముంబయి లోని ఓ హోటల్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. ఓ కుటుంబం మసాలా దోశ ఆర్డర్ చేసింది. కొద్దిగా తిన్న తర్వాత దోశలో ఎలుక కనిపించించడంతో వాంతులు అయినట్లు బాధితుడు పేర్కొన్నారు. అతను వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం ఎఫ్‌డీఏ (FDA) దృష్టికి వెళ్లింది. ఈ క్రమంలో అధికారులు హోటల్‌ను తనిఖీ చేసి.. లైసెన్సును సస్పెండ్ చేశారు.

## రష్యాలో ఉద్యోగ ఆఫర్లకు ఆకర్షితులు కావద్దు! – కేంద్రం హెచ్చరిక

విదేశాల్లో ఉద్యోగాలంటూ వస్తున్న వార్తలపై భారత విదేశాంగ శాఖ మరోసారి స్పందించింది. రష్యా సాయుధ దళాల్లో భారతీయులను నియమించుకుంటున్నట్లు (Jobs in Russia) నివేదికలు వస్తూనే ఉన్నాయని, ఇందులో ఉన్న నష్టాలు, ప్రమాదాల గురించి గత రెండేళ్లుగా చెబుతూనే ఉన్నామని పేర్కొంది. విదేశాల్లో ఉద్యోగ అవకాశాల కోసం ప్రయత్నించే భారతీయులు.. ధ్రువీకరించని వ్యక్తులు, ఏజెంట్ల ఆఫర్లకు ఆకర్షితులు కావొద్దని హెచ్చరించింది. ఈ మేరకు విదేశాంశ శాఖ అడ్వైజరీ జారీ చేసింది.



* రష్యన్ సాయుధ దళాల్లో చేరితే భారీగా డబ్బు వస్తుందని, ఆ తర్వాత భారత ప్రభుత్వాన్ని ఆశ్రయించి విడుదల కావచ్చని భావించి ఉద్దేశపూర్వకంగా రష్యా సైన్యంలో చేరేందుకు సిద్ధమవుతున్న వారినీ చూశామని కేంద్రం పేర్కొంది. కానీ, ఇది ప్రమాదకరమైన మార్గమని.. ఇటువంటి వాటిని ఎట్టిపరిస్థితుల్లోనూ ప్రోత్సహించబోమని ఉద్ఘాటించింది.

* భారత పౌరసత్వాన్ని వదులుకొని, రష్యా పాస్‌పోర్టు తీసుకొని అక్కడి సైన్యంలో చేరేందుకు కొందరు ప్రయత్నిస్తున్నట్లు కూడా తమ దృష్టికి వచ్చిందని కేంద్రం వెల్లడించింది. భారత అధికారులను సంప్రదించకుండానే ఇప్పటికే పలువురు ఇలా చేశారని చెప్పింది. తాత్కాలిక ఆర్థిక ప్రయోజనాల కోసం ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం వల్ల ప్రాణాలకు తీవ్ర ముప్పు ఏర్పడే అవకాశం ఉందని హెచ్చరించింది.

* విదేశీ పౌరులను రష్యా సాయుధ దళాల్లో చేర్చేందుకు ప్రైవేట్ సంస్థలు, కొన్ని గ్రూపులు ప్రయత్నిస్తున్న విషయం తమ దృష్టికి వచ్చిందని కేంద్రం తెలిపింది. విదేశాంగశాఖలో నమోదు కాని అనధికార ఏజెంట్ల నుంచి ఉద్యోగ ఆఫర్లు అంగీకరించే ముందు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించింది.

## గోధుమల మద్దతు ధర పెంపు.. కేంద్ర క్యాబినెట్ కీలక నిర్ణయాలు

ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర క్యాబినెట్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలను కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. 202728 ఏడాదికి గోధుమలకు కనీస మద్దతు ధరను క్వింటాల్‌కు రూ.25 చొప్పున పెంచుతూ కేంద్రమంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. దీంతో క్వింటాల్‌కు మద్దతు ధర రూ.2,610కు చేరింది. గోధుమలతో పాటు మరికొన్ని పంటలకు సైతం మద్దతు ధరను పెంచింది. దేశ రాజధాని దిల్లీలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టింది. దీనికోసం రూ.1,789 కోట్ల అంచనా వ్యయంతో 'ఇంటెలిజెంట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ వ్యవస్థ'



అమలుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. రియల్ టైమ్ ట్రాఫిక్ డేటా, అడాప్టివ్ సిగ్నల్స్, ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ వ్యవస్థల ద్వారా దిల్లీలోని 42 కారిడార్లలో ట్రాఫిక్‌ను సజావుగా నిర్వహించేలా ఈ ప్రాజెక్టు వీలు కల్పిస్తుందని అశ్వినీ వైష్ణవ్ వివరించారు. 135 గిగావాట్ల పునరుత్పాదక ఇంధనాన్ని వినియోగించుకునేలా విద్యుత్ వ్యవస్థ ఏర్పాటుకు రూ.1.86 లక్షల కోట్ల వ్యయంతో కూడిన 'గ్రీన్ ఎనర్జీ కారిడార్ ఫేజ్ 3'కి కేంద్ర మంత్రివర్గం పచ్చజెండా ఊపింది. 2030 నాటికి 500 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని సాధించాలనే లక్ష్యంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకుంది. దేశంలో పాత నేర చట్టాల స్థానంలో భారతీయ న్యాయసంహిత (బీఎన్ఎస్) అమల్లోకి వచ్చాక కేసుల విచారణ వేగవంతమైందని.. ఇటీవల జరిగిన ఓ హత్య కేసులో ఎనిమిది రోజుల్లోనే తీర్పు వచ్చిందని అశ్వినీ వైష్ణవ్ తెలిపారు.

## సీఈసీ సస్పెన్షన్ కోరుతూ పిటిషన్.. విచారణకు స్వీకరించిన సుప్రీంకోర్టు

దిల్లీ: కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్ సస్పెన్షన్‌ను కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)పై సుప్రీంకోర్టు వచ్చేవారం విచారణ జరపనుంది. మిగతా ఇద్దరు ఎన్నికల కమిషనర్ల ఆమోదం లేకుండానే ఆయన నేతృత్వంలోని ఈసీ పలు నిర్ణయాలు తీసుకోవడాన్ని పట్నాకు చెందిన రాకేశ్ కుమార్ సింగ్ ఈ పిల్ ద్వారా సవాల్‌చేశారు. చట్టం ప్రకారం ఈసీలో నిర్ణయాలు ఏకగ్రీవంగా గానీ, మెజార్టీ ఆమోదంతో గానీ తీసుకోవాలని సింగ్ తరఫున సీనియర్ న్యాయవాది వికాస్ సింగ్ మంగళవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనానికి తెలిపారు. ఈసీ పని విధానం చూస్తుంటే అవి ఏకగ్రీవ నిర్ణయాలేనా అనే తీవ్ర అనుమానాలు తలెత్తుతున్నాయని చెప్పారు. పూర్తి కమిషన్ బదులు నిర్ణయాలను జ్ఞానేశ్ వ్యక్తిగతంగా తీసుకుంటున్నారా అనేది నిర్ధారించాలని కోరారు.



ఒకవేళ అది నిజమే అయితే అవి అక్రమమని ప్రకటించి, చట్టపరంగా తగిన చర్య తీసుకోవాలని అభ్యర్థించారు. సీఈసీ తన అధికారాలను ఉపయోగించకుండా అడ్డుకట్ట వేయాలన్నారు. బహుళ సభ్యుల విధానాన్ని పునరుద్ధరించడానికి సీఈసీని సస్పెండ్ చేయాలని కోరారు. ఈసీ సమావేశాల ఎజెండాలు, చర్చనీయాంశాలు, తీర్మానాలు, పని విభజన ఉత్తర్వులు, ఐటీ సర్వర్లు, డేటాబేస్ మార్పుల చరిత్ర వంటి వివరాలన్నీ కోర్టు రాబట్టాలని కోరారు.

## విమానాన్ని కూల్చివేసేందుకు యత్నించాడు : నెతన్యాహు

ఫ్లైదుబాయ్ విమానంలోని ఓ పైలట్.. తోటి పైలట్‌ను కత్తితో పొడిచి, విమానాన్ని కూల్చివేసేందుకు యత్నించాడని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ఆరోపించారు. ప్రయాణికులు, సిబ్బంది కలిసి అతడిని కట్టడి చేసి.. పెను ప్రమాదాన్ని నివారించారని తెలిపారు. అసమాన ధైర్యసాహసాలు, సమయస్ఫూర్తి ప్రదర్శించి.. ఎంతోమంది ప్రాణాలను కాపాడారని, వారికి సెల్యూట్ చేస్తున్నట్లు నెతన్యాహు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దాడికి పాల్పడిన పైలట్‌ను సౌదీ అరేబియా పోలీసులు అరెస్టు చేశారని వెల్లడించారు. దుబాయ్ నుంచి ఇజ్రాయెల్‌కు



బయల్దేరిన ఫ్లైదుబాయ్ విమానంలో కెప్టెన్‌పై కో పైలట్ కత్తితో దాడి చేసిన ఘటన తీవ్ర కలకలం రేపిన విషయం తెలిసిందే.

## 'ఫ్లైదుబాయ్' ఘటన.. 180 మందిని కాపాడిన భారత కెప్టెన్..!

దుబాయ్ నుంచి ఇజ్రాయెల్ బయల్దేరిన ఫ్లైదుబాయ్ విమానంలో హింసాత్మక ఘటన ఉలిక్కిపాటుకు గురిచేసింది. ఈ విమానం గగనతలంలో ఉండగా.. కెప్టెన్‌పై కోపైలట్ కత్తితో దాడి చేయడంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. దీని వెనుక ఉగ్ర కుట్ర ఉన్నట్లు ఇజ్రాయెల్ అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కాగా.. ఈ ఘటనలో కో పైలట్‌తో పోరాడి.. ప్రయాణికులను కాపాడిన కెప్టెన్ భారతీయుడని తెలుస్తోంది. ఈ మేరకు ఇజ్రాయెల్ మీడియా కథనాలు వెల్లడించాయి. ఘటన సమయంలో విమానంలో 180 మంది ప్రయాణికులు ఉన్నారు. దుబాయ్ నుంచి విమానం టేకాఫ్ అయిన దాదాపు రెండున్నర గంటల తర్వాత కాక్‌పిట్‌లో ఘర్షణ చోటుచేసుకుంది. కో పైలట్ ఉన్నట్టుండి కెప్టెన్‌పై కత్తితో దాడి చేసినట్లు సమాచారం. కాక్‌పిట్ నుంచి శబ్దాలు వినపడగానే.. ఇదే విమానంలో ఆఫ్‌డ్యూటీలో ఉన్న పైలట్లు, ప్రయాణికులు కోపైలట్‌ను అడ్డుకున్నారు. అప్పటికే కెప్టెన్, ఫస్ట్ ఆఫీసర్ గాయపడ్డారు. కాక్‌పిట్ అంతా రక్తపు మరకలు ఉన్నాయి. ఆఫ్‌డ్యూటీలో ఉన్న ఇద్దరు పైలట్లు విమానాన్ని సురక్షితంగా సౌదీ అరేబియాలో




ల్యాండ్ చేశారు. కత్తిపోటుకు గురైన కెప్టెన్ భారత్‌కు చెందినవాడని ఇజ్రాయెల్ మీడియా కథనాలు పేర్కొన్నాయి. తన ప్రాణాలకు తెగించి కోపైలట్‌తో కెప్టెన్ పోరాడారని.. విమానం కూలకుండా అడ్డుకుని 180 మంది ప్రాణాలను కాపాడారని తమ కథనాల్లో రాసుకొచ్చాయి. అయితే, దీనిపై ఎలాంటి అధికారిక ధ్రువీకరణ ఇంకా రాలేదు.

**కో-పైలట్‌కు ద్వంద్వ పౌరసత్వం..?**

దాడికి పాల్పడిన కోపైలట్ ఒమన్ జాతీయుడని ఇజ్రాయెల్ మీడియా కథనాలు ఆరోపించాయి. అయితే, ఇజ్రాయెల్‌ఒమన్ మధ్య దౌత్య సంబంధాలు లేవు. అలాంటప్పుడు టెల్‌అవీవ్‌కు వెళ్లే విమానంలో ఒమన్ పౌరుడిని ఎలా అనుమతించారన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. సాధారణంగా అరబ్/గల్ఫ్ దేశాల నుంచి ఇజ్రాయెల్ గగనతలంలోకి వచ్చే విమానాలకు కఠిన స్క్రీనింగ్ ఉంటుంది. ఒకవేళ, ఆ కో పైలట్‌కు ద్వంద్వ పౌరసత్వం ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై దర్యాప్తు జరుపుతున్నట్లు ఇజ్రాయెల్ అధికారిక వర్గాలు తెలిపాయి.

## 'ఫ్లైదుబాయ్' ఘటన.. గతంలోనూ కాక్‌పిట్‌లో ఘర్షణలు

దుబాయ్ నుంచి ఇజ్రాయెల్‌కు బయల్దేరిన విమానం.. కాక్‌పిట్‌లో ఘర్షణతో సౌదీ అరేబియాలో అత్యవసరంగా దిగిన విషయం తెలిసిందే. ఈ గొడవకు గల కారణాలపై ప్రస్తుతానికి అధికారికంగా స్పష్టత రాలేదు. ఇదిలా ఉంటే.. గతంలోనూ విమానం కాక్‌పిట్‌లో పైలట్లు ఘర్షణ పడిన సందర్భాలు ఉన్నాయి. ఇందులో లండన్ ముంబయి విమాన ఘటన కూడా ఉంది.

* 2022 జూన్‌లో జెనీవా నుంచి పారిస్‌కు వెళ్తున్న ఎయిర్ ఫ్రాన్స్ ఏ320 విమానం కాక్‌పిట్‌లో ఇద్దరు పైలట్లు గొడవకు దిగారు. అంతేకాకుండా అనుచితంగా సంజ్ఞలూ చేసుకున్నట్లు ఆ విమానయాన సంస్థ తెలిపింది. ఈ వివాదం నేపథ్యంలో ఇద్దరు పైలట్లపై



సస్పెన్షన్ వేటుపడింది.

* 2018 జులైలో ఇరాన్ రాజధాని టెహ్రాన్ నుంచి ఇరాక్‌లోని బాగ్దాద్‌కు వెళ్తున్న ఇరాకీ ఎయిర్‌వేస్ విమానంలో ఇద్దరు పైలట్ల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఆ సమయంలో విమానం 37 వేల అడుగుల ఎత్తులో ప్రయాణిస్తోంది. ఆ గొడవ బాహాబాహీకి దారితీయడంతో అనంతరం ఇద్దరినీ సస్పెండ్ చేశారు.

* 2018 జనవరిలో లండన్ నుంచి ముంబయికి వస్తున్న జెట్ ఎయిర్‌వేస్ విమానంలో ఇద్దరు భారతీయ పైలట్లు కాక్‌పిట్‌లో గొడవపడ్డారు. పురుష పైలట్.. మహిళా పైలట్‌ను చెంపదెబ్బ కొట్టడంతో గొడవ మొదలైనట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి. ఆ సమయంలో పైలట్లు రెండుసార్లు కాక్‌పిట్‌ను పర్యవేక్షించకుండా వదిలేశారు. ఈ తర్వాత విమానయాన సంస్థ ఇద్దరినీ విధుల నుంచి తొలగించింది.

## 12 ఏళ్లుగా కొనసాగిన మిషన్ పూర్తి.. ఇరాక్ నుంచి అమెరికా బలగాల ఉపసంహరణ

ఇరాక్ లో తమ సైనిక మిషన్ పూర్తయిందని అమెరికా ప్రకటించింది. ఐసిస్ ఉగ్రవాద సంస్థను అణచివేయడమే లక్ష్యంగా కొనసాగిన ఈ మిషన్ ముగిసిందని వెల్లడించింది. ఉత్తర ఇరాక్‌లోని ఇర్బిల్ వైమానిక స్థావరం నుంచి అమెరికా (USA) చివరి బృందం బుధవారం యూఎస్‌కు తిరిగివెళ్లింది. సైనికుల ఉపసంహరణ విజయవంతంగా పూర్తయిందని పెంటగాన్ అధికార ప్రతినిధి సీన్ పార్నెల్ వెల్లడించారు. ఇక ఇరాక్ భద్రతకు ఆ దేశ బలగాలే ప్రధాన బాధ్యత వహించనున్నాయని తెలిపారు. ఈ క్రమంలో అమెరికాతో సాధారణ ద్వైపాక్షిక భద్రతాపరమైన సంబంధాలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. అమెరికా 2003లో ఇరాక్‌పై దాడి చేసి సద్దాం హుస్సేన్ ప్రభుత్వాన్ని కూల్చింది. ఆ తర్వాత 2011లో బలగాలను ఉపసంహరించుకుంది. అయితే 2014లో ఐసిస్ ఇరాక్‌లోని పలు ప్రాంతాలను ఆక్రమించడంతో ఆ దేశ ప్రభుత్వం అమెరికా బలగాలను ఆహ్వానించింది.



ఒకప్పుడు చందమామను చూపిస్తూ.. గోరుముద్దలు తినిపించేది అమ్మ! పిల్లాడు ఆరోగ్యంగా పెరిగేవాడు. ఇప్పుడు.. సెల్‌ఫోన్ చేతికిచ్చి, ముద్దలు తినిపిస్తుంది. నాన్నేమో.. ట్యాబ్ చూపిస్తూ లాల పోస్తున్నాడు. ఇలాంటి పరిస్థితుల్లో ఎదుగుతున్న చిన్నారులను.. పసితనంలోనే అనేక రుగ్మతలు చుట్టుముడుతున్నాయి. పెరుగుతున్న సాంకేతికత కొన్నిరకాల వ్యాధులకు కారణం అవుతున్నది. అందులో ఒకటి ఆటిజం. సెల్‌ఫోన్లు, ట్యాబ్‌ల వాడకం పెరిగేకొద్దీ ఆటిజం సమస్య హెచ్చుతున్నది.

# ఆటిజం.. అరువు తెచ్చుకుంటున్నాం!

**మన దేశంలో ప్రతి 80మంది చిన్నారుల్లో ఒకరికి ఆటిజం సమస్య ఉండవచ్చనేది ఒక అంచనా. ఈ సమస్యను దృష్టిలో పెట్టుకుని ఆటిజంపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ ఏటా ఏప్రిల్ 2న 'వరల్డ్ ఆటిజం అవేర్‌నెస్ డే' నిర్వహిస్తున్నది. అసలు ఈ ఆటిజం అంటే ఏంటి, అది ఎందుకు వస్తుంది, రావడానికి గల కారణాలేంటి? దాని లక్షణాలు, ఆటిజం వల్ల పిల్లల్లో ఎలాంటి అనారోగ్యం ఏర్పడుతుంది? ఈ సమస్యను ఎలా గుర్తించాలి, నిర్ధారణ పద్ధతులు, చికిత్సా విధానం తదితర అంశాలను నేటి ఊపిరిలో తెలుసుకుందాం.**

**ఆటిజం** అనేది బయటికి కనిపించే ఒక రకమైన మానసిక వ్యాధి లక్షణం. చాలా ఆటిజం కేసుల్లో మాటలు మొదట్లో వస్తాయి. కానీ రెండేండ్లు వచ్చేసరికి మాటలు ఆగిపోతాయి. దీనినే 'రిగ్రెషన్' అంటారు. చాలామంది పిల్లల్లో మొదటి రెండేండ్లలోపే ఇది జరుగుతుంది. ఆటిజం సమస్య ఉన్న చిన్నారుల్లో నాలుగైదు ప్రధాన లక్షణాలు కనిపిస్తాయి.

1. భావ వ్యక్తీకరణ లేకపోవడం. అది భాష పరంగా గానీ, హావభావాలు వ్యక్తపరచడంలో గానీ సమస్య ఉంటుంది. అంటే వాళ్లు సరిగ్గా మాట్లాడలేరు.
2. ఇతరుల భావాలను గ్రహించలేరు. అంతేకాదు వారి భావోద్వేగాలను వ్యక్తపర్చలేరు.
3. సామాజిక బాంధవ్యాలు తెలియదు. అంటే ఇతరులతో కలిసి ఆడుకోవడం, కలివిడిగా ఉండటానికి ఇష్టపడరు. ఒంటరిగా ఉండాలని కోరుకుంటారు.
4. చేసిన పనినే మళ్లీ మళ్లీ చేస్తుంటారు.
5. ఈ చిన్నారుల్లో మానసిక పరిణతి తక్కువగా ఉంటుంది.

ఈ లక్షణాలన్నీ ఆటిజం పిల్లల్లో ప్రాథమికంగా కనిపిస్తుంటాయి. ఈ సమస్యలతో సతమతమవుతున్న వారిని ఆటిజం బాధితులుగా పరిగణిస్తారు.



### కారణాలు

- ఆటిజం సమస్యకు ఒక ప్రత్యేకమైన కారణమని ఏదీ లేదు. సాధారణంగా 9 నెలల నుంచి 18 నెలలు వచ్చే వరకు పిల్లలు భావాలను వ్యక్తీకరించడంతో పాటు, గ్రహించడం, భాష నేర్చుకోవడం చేయగలుగుతారు. ఈ వయసులో చిన్నారులకు ఫోన్‌లు, టీవీ, ట్యాబ్ లాంటివి అలవాటు కావడం వల్ల భావ వ్యక్తీకరణ, భాష నేర్చుకోవడం దెబ్బతింటుంది. స్క్రీన్ టైమ్‌కి అలవాటు పడితే ఈ సమస్యలు వస్తాయి. అమెరికన్ పీడియాట్రిక్ సొసైటీ ప్రకారం మొదటి 3 సంవత్సరాల వరకు పిల్లలను ఫోన్, టీవీకి దూరంగా ఉంచడం మంచిది. వాటికి అలవాటుపడితే ఆటిజం వచ్చే ప్రమాదం ఉందని సదరు సొసైటీ హెచ్చరించింది.
- బహుళ భాషలను నేర్చుకోవాల్సి రావడమూ పిల్లల్లో ఆటిజం సమస్యకు కారణం కావొచ్చు. చిన్నారులకు మాటలు వచ్చే క్రమంలో.. తల్లిదండ్రులు వేర్వేరు భాషల్లో మాట్లాడటం వల్ల, పిల్లలకు ఏ భాషను స్వీకరించాలో అర్థం కాదు. వాళ్లు అయోమయానికి గురై భాషపై పట్టుచిక్కకపోవడం వల్ల ఆటిజానికి గురయ్యే అవకాశాలు ఉంటాయి.
- యాంటీ బయోటిక్స్ లాంటి ఔషధాలు ఎక్కువగా వాడటం కూడా ఆటిజానికి దారి తీయొచ్చు.
- ఐవీఎఫ్ ద్వారా జన్మించిన పిల్లల్లో కూడా ఆటిజం రిస్క్ కనిపిస్తున్నది.
- 18 నెలల వయసులో పిల్లలకు ఇచ్చే ఎంఎంఆర్ టీకా వల్ల కూడా ఆటిజం వస్తుందనేది ప్రజల్లో ఉన్న ఒక అపోహ మాత్రమే. దానికి సంబంధించి ఇప్పటి వరకు ఎలాంటి ఆధారాలు లేవు.

గతంలో ఉమ్మడి కుటుంబాలు ఉండేవి. పిల్లల పెంపకంలో పెద్దల పాత్ర అధికంగా ఉండేది. అమ్మమ్మ, నానమ్మ, తాతయ్య, మేనమామ, అత్తయ్య, చిన్నాన్న, పిన్ని... ఇలా ఎవరో ఒకరు పిల్లలతో సమయం గడిపేవారు. అప్పట్లో సెల్‌ఫోన్‌లు, ట్యాబ్‌ల ఊసే లేదు. మనుషుల మధ్య కమ్యూనికేషన్ ఎక్కువగా ఉండేది. నిరంతరం వారి మధ్య ఉండటం వల్ల పిల్లల్లో భాషా వికాసం బాగా ఉండేది. హావభావాల వ్యక్తీకరణతో పాటు మానసిక పురోగతిలోనూ వయసుకు తగ్గ పరిణతి కనిపించేది. కానీ, ఇప్పుడు ఉమ్మడి కుటుంబాల ఉనికి గణనీయంగా తగ్గిపోయింది. నూటికి 90 శాతం న్యూక్లియర్ ఫ్యామిలీలే ఉంటున్నాయి. దీనికితోడు తల్లిదండ్రులు ఇద్దరూ ఉద్యోగాలు చేయడం వల్ల పిల్లలు అధిక సమయం ఒంటరిగా గడపాల్సి వస్తున్నది. మనుషులతో కన్నా డిజిటల్ కమ్యూనికేషన్ ఎక్కువైంది. ఏడాది వయసున్న పిల్లలు కూడా సెల్‌ఫోన్, ట్యాబ్‌తో ఆడుకోవడం కనిపిస్తున్నది. ఇలాంటి పరిస్థితులు సైతం ఆటిజానికి దారితీసే అవకాశాలు లేకపోలేదు.

### రోగ నిర్ధారణ పద్ధతులు

**ప్రత్యేక** లక్షణాలు కనిపించిన వెంటనే సంబంధిత వైద్యులను సంప్రదించాలి. ఆటిజాన్ని నిర్ధారించేందుకు ఇప్పటి వరకు ప్రపంచ వ్యాప్తంగా ఎలాంటి వైద్య పరిజ్ఞానం గానీ, రోగ నిర్ధారణ పద్ధతులు గానీ అందుబాటులో లేవు. కేవలం అనుభవజ్ఞులైన సైకాలజిస్టులు, సైకియాట్రిస్టులు మాత్రమే సమస్యను కొన్ని రకాల పరీక్షల ద్వారా నిర్ధారించగలరు.

### లక్షణాలు

- పిల్లలు తల్లిదండ్రుల కండ్లలోకి కూడా నేరుగా చూడలేకపోవడం
- పేరుపెట్టి పిలిచినా వెంటనే స్పందించకపోవడం
- ఇతర పిల్లలతో కలిసి ఆడుకోకపోవడం
- ఒంటరిగా ఉండేందుకే ఇష్టపడటం
- ఒకే రకమైన బొమ్మతో మాత్రమే ఆడుకోవడం, మరో బొమ్మ ఇస్తే తీసుకోకపోవడం
- కొందరు పిల్లల్లోనైతే స్పర్శ, వాసన, చూపు, వినికిడి వంటి జ్ఞానేంద్రియ వ్యవస్థ అసంబద్ధంగా ఉంటుంది.

ఈ లక్షణాలన్నీ మొదటి మూడు సంవత్సరాల్లోపు కనిపిస్తాయి.

### చికిత్సా పద్ధతులు

ఆటిజానికి సంబంధించిన లక్షణాలను ఎంత త్వరగా గుర్తించి, సరైన థెరపీలను అందించగలిగితే అంత మంచిది. 6 నెలల్లోనే 50 శాతం సమస్యను నివారించవచ్చు. కనీసం 3 సంవత్సరాల్లోపు సమస్యను గుర్తించి చికిత్స అందిస్తేనే ఫలితం ఉంటుంది. ఈ 3 సంవత్సరాల గోల్డెన్ టైమ్ దాటిపోతే ఎలాంటి చికిత్సలు అందించినా ఫలితం ఆశించిన మేరకు ఉండకపోవచ్చు. ఆటిజం బాధిత చిన్నారులకు ప్రధానంగా మూడు రకాల థెరపీలతో చికిత్స అందిస్తారు. అందులో 1.ఆక్యుపేషనల్ థెరపీ 2. బిహేవియర్ థెరపీ 3. స్పీచ్ థెరపీ

### 1.ఆక్యుపేషనల్ థెరపీ:

పిల్లల్లో ప్రారంభ దశలో జ్ఞానేంద్రియాలు అసంబద్ధంగా ఉన్నట్లు గుర్తిస్తే, ఆక్యుపేషనల్ థెరపీ అందించవచ్చు. దీని వల్ల ఐదు జ్ఞానేంద్రియాలు నియంత్రణలోకి వచ్చి, సమస్య దాదాపుగా పరిష్కారమవుతుంది.



### 2.బిహేవియర్ థెరపీ:

బిహేవియర్ థెరపీతో పిల్లల అసాధారణ ప్రవర్తనకు సంబంధించిన సమస్యలు పరిష్కరించవచ్చు.

### 3. స్పీచ్ థెరపీ:

ఆటిజం పిల్లల విషయంలో స్పీచ్ థెరపీ చాలా ముఖ్యమైంది. మొదటి రెండు థెరపీలు... అంటే ఆక్యుపేషనల్ థెరపీ, బిహేవియర్ థెరపీల తర్వాతే స్పీచ్ థెరపీ ఇవ్వాల్సి ఉంటుంది. అప్పుడే ఇది ప్రభావవంతంగా పనిచేస్తుంది.

### సలహాలు

- ప్రారంభ దశలోనే గుర్తించి నిపుణులైన వైద్యులను సంప్రదించాలి.
- మూడేండ్లలోపు పిల్లలను బ్లూ లైట్‌కు దూరంగా ఉంచాలి. అంటే సెల్‌ఫోన్స్, ట్యాబ్స్, టీవీలు వంటి ఎలక్ట్రానిక్ పరికరాలు ఇవ్వకూడదు.
- పిల్లలకు ఎలక్ట్రానిక్ పరికరాలు ఇచ్చి, ఒంటరిగా వదిలేయకుండా వారితో తల్లిదండ్రులు లేదా ఇతర కుటుంబ సభ్యులు గడపడం ఉత్తమం.



# ఎండల్లో ఇలా చేయకండి!

ఎండాకాలం వచ్చిందంటే చర్మానికీ, శరీరానికీ అవసరాలు మారతాయి. దానికి తగ్గట్టు కొన్ని విషయాల్లో మనమూ మారతాం. అక్కడే తప్పు చేసే అవకాశం ఉంది. ఇవి అవసరాలు కాదు, అనర్థాలు అంటున్నారు చర్మ, ఆరోగ్య నిపుణులు.

### ఇంట్లో అక్కర్లేదు

సన్‌స్క్రీన్ బయటికెళ్లేప్పుడు మాత్రమే రాసుకోవాలి. ఇంట్లో ఉన్నా, కారులో వెళ్తున్నా అక్కర్లేదు అనుకోవడం అపోహ మాత్రమే. మనం ఎక్కడ ఉన్నా మన చుట్టూ ఉండే వెలుతురులో చర్మానికి హాని చేసే అతినీల లోహిత కిరణాలు ఉంటాయి. కాబట్టి తప్పకుండా ఈ సమయంలో సన్‌స్క్రీన్ వాడాలి.

### కడుగుతూనే ఉండాలి

ఎండాకాలం వచ్చిందంటే అదేదో యాడ్‌లో 'కడుగు బాబు కడుగు' అన్నట్టు మొహాన్ని మాటిమాటికీ నీళ్లతో కడుగుతుంటారు. ఇది ఎండవేళ చర్మానికి హాయిని కలిగించి, తేమగా ఉంచుతుందని అనుకుంటారు. కానీ ఇది నిజం కాదు. ఇలా మాటిమాటికీ నీటితో చర్మాన్ని కడగడం వల్ల 'ట్రాన్స్ ఎపిడెర్మల్ వాటర్ లాస్ (టీఈడబ్ల్యూఎల్)' అని పిలిచే ప్రత్యేక పరిస్థితి ఏర్పడుతుంది. దీంతో చర్మం తేమను కోల్పోయి పొడిబారుతుంది.

### అదైతే చాలు

వేసవిలో ఏ వీధి మూలన చూసినా మజ్జిగ, పుదీనా రసం కుండలు, జీరా నీళ్లు, నిమ్మరసాలు దొరుకుతుంటాయి. ఎండవేళ చలువ చేస్తాయన్న ఉద్దేశంతో వాటిని స్వేచ్ఛగా తాగుతుంటారు. కానీ, ఇలా బయట దొరికేవి తాగేప్పుడు అక్కడ ఎంత పరిశుభ్రత పాటిస్తున్నారు, ఎలాంటి నీళ్లు వాడుతున్నారులాంటివి గమనించాలి. లేకపోతే పొట్టకు లేనిపోని తంటా తెచ్చినట్టే.

### అన్నీ తాగొచ్చు

ఎండవేళ శరీరంలో నీటి స్థాయుల్ని నిలిపి ఉంచేందుకు ద్రవాలు ఎక్కువగా తీసుకోవాలి. కాబట్టి మంచీ చెడులతో సంబంధం లేకుండా ఏమైనా తాగొచ్చు అనుకోవడం పొరపాటు. కేవలం మజ్జిగ, కొబ్బరినీళ్ల లాంటి సంప్రదాయ ఆరోగ్యకర పానీయాలకే ప్రాధాన్యం ఇవ్వాలి. మిల్క్‌షేక్‌లు, శీతల పానీయాల్లాంటి హై క్యాలరీ డ్రింకులను ఏ కాలంలో అయినా పక్కన పెట్టేయాల్సిందే.





# నిద్రలోనూ సుఖం లేదు!

**శారీరక** శ్రమకు, మానసిక ఆందోళనకు చక్కని ఔషధం నిద్ర. ఆరు గంటలు ఆదమరచి నిద్దరోతే.. సమస్యలన్నీ పరారైన అనుభూతి కలుగుతుంది. కానీ, సుఖమెరుగని నిద్ర.. అతివలకు అంతగా అందడం లేదని సర్వేల సారాంశం. స్లీప్ ఫౌండేషన్ ఇచ్చిన నివేదిక.. పురుషుల కన్నా స్త్రీలు నిద్రలేమితో ఎక్కువగా బాధపడుతున్నారని తేల్చింది. ఉద్యోగం, ఇల్లు, పిల్లలు, ఇతర బాధ్యతలతో మల్టీ టాస్కింగ్ చేస్తున్న మహిళలు సరైన నిద్ర లేక సతమతమవుతున్నారని నివేదిక సారాంశం. ఇందుకు కారణాలూ లేకపోలేదు. రుతుక్రమంలో ఈస్ట్రోజెన్, ప్రొజెస్టిరాన్లలో హెచ్చుతగ్గులు నిద్రకు భంగం కలిగిస్తాయి. ముఖ్యంగా రుతుస్రావం ముందు, మెనోపాజ్ సమయంలో వేడి ఆవిర్లు, రాత్రి చెమటలు నిద్రను భంగపరుస్తున్నాయని పరిశోధకులు తేల్చారు. అంతేకాదు గర్భిణిగా ఉన్నప్పుడు హార్మోన్లలో చోటుచేసుకునే మార్పుల కారణంగా శారీరక అసౌకర్యం ఏర్పడుతుంది. ఇది నిద్ర నాణ్యతపై గణనీయంగా ప్రభావం చూపుతుందట. ఈ నిద్రలేమి హృదయ సంబంధ వ్యాధులు, మానసిక రుగ్మతలకు దారి తీస్తుందని ఆరోగ్యరంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు. సుఖనిద్రకు తగ్గ ఏర్పాట్లు చేసుకోవడం అవసరమని సూచిస్తున్నారు.

# స్నానం తర్వాత బ్రషింగా?

**ఒక్కోసారి** హడావుడిగా, ఏదో ఆలోచనలో ఉండి బ్రష్ చేసుకోలేదనే విషయం మరిచిపోయి స్నానం చేసేస్తుంటాం. తర్వాత గుర్తొచ్చి అప్పుడు బ్రష్ చేసుకుంటాం. ఇది ఎప్పుడో పొరపాటున ఒకసారి జరిగితే పర్వాలేదు. కానీ, అదే అలవాటుగా మారితే మాత్రం చర్మానికి నష్టమేనని హెచ్చరిస్తున్నారు ఆరోగ్య నిపుణులు. మనం పళ్లు తోముకున్నప్పుడు బ్యాక్టీరియా నోటి నుంచి చర్మం మీదకు చేరే ఆస్కారం ఎక్కువగా ఉంటుంది. అందువల్ల నోటి చుట్టూ, గడ్డం చుట్టూ ఇరిటేషన్ వచ్చే అవకాశం ఉంటుంది. తర్వాత అది నెమ్మదిగా మొటిమలకు కారణమవుతుంది. బ్రష్ చేసే సమయంలో చర్మం మీదికి బదిలీ అయిన బ్యాక్టీరియా వల్ల చర్మం మీద పగుళ్లు కూడా ఏర్పడవచ్చని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అందుకే స్నానానికి ముందే బ్రష్ చేసుకోవడం సురక్షితం. ఒకవేళ స్నానం తర్వాత బ్రష్ చేయాల్సి వస్తే ముఖాన్ని మరోసారి సబ్బుతో లేదా ఫేస్‌వాష్‌తో శుభ్రం చేసుకోవాలని సూచిస్తున్నారు.



# ముందే తినేయాలి!

**రోజూ వీలైనంత త్వరగా భోజనంచేస్తే గుండె రక్తనాళాల వ్యాధుల ముప్పు తగ్గుతుందట. నేచర్ కమ్యూనికేషన్స్ జర్నల్‌లో ప్రచురితమైన ఈ అధ్యయనం కోసం పరిశోధకులు 1,03,389 మంది నుంచి ఆహార విధానాలు, గుండె రక్తనాళాల జబ్బులకు సంబంధించిన సమాచారం సేకరించారు. వీరిలో 79 శాతం మంది మహిళలే. పరిశోధనలో పాల్గొన్నవాళ్ల సగటు వయసు 42 ఏండ్లు..**

**వయసు,** లింగం, కుటుంబ పరిస్థితి మొదలైన సామాజిక పరిస్థితులు, ఆహారంలో పోషకాల నాణ్యత, జీవనశైలి, నిద్రా చక్రాన్ని పరిశోధకులు పరిగణనలోకి తీసుకున్నారు. పొద్దున్నే టిఫిన్ చేయకుండా భోజనం చేసేవారిలో ఒక్కో గంట ఆలస్యానికి గుండె రక్తనాళాల వ్యాధుల తీవ్రత 6 శాతం పెరుగుతుందని పరిశోధకులు కనుక్కొన్నారు. అంటే పొద్దునే 9 గంటలకు తినే వ్యక్తికి 8 గంటలకే తిన్న వ్యక్తితో పోలిస్తే గుండె రక్తనాళాల జబ్బుల ముప్పు 6 శాతం ఎక్కువగా ఉంటుందన్న మాట. 9 తర్వాత ఒక్కో గంట గడుస్తుంటే ఈ ముప్పు 28 శాతం ఎక్కువగా ఉంటుందని అధ్యయనం వెల్లడించింది. అయితే, ముందురోజు రాత్రి చివరి భోజనానికి, తర్వాతి రోజు ఉదయం భోజనానికి మధ్య విరామం ఎక్కువగా ఉంటే గుండె రక్తనాళాల వ్యాధుల ముప్పు తక్కువట. అలా ఈ పరిశోధన రోజూ పొద్దున, సాయంత్రం భోజనాలు వీలైనంత త్వరగా ముగించేయాలని వెల్లడిస్తున్నది.

గ్లోబల్ బర్డన్ ఆఫ్ డిసీజెస్ అధ్యయనం ప్రకారం ప్రపంచ ప్రజల్లో మరణాలకు కారణమయ్యే వ్యాధుల్లో గుండె రక్తనాళాల సమస్యలే ముందువరుసలో ఉన్నాయి. 2019లో గుండె సమస్యలతో 18.6 మిలియన్ల మంది మరణించారు. వీటిలో 7.9 శాతం మరణాలకు ఆహారపు అలవాట్లే ప్రధాన కారణంగా నిలిచాయి. అంటే... ''ఈ తరహా వ్యాధుల పుట్టుక, అభివృద్ధిలో ఆహారం కీలకపాత్ర పోషిస్తున్నదని తెలుస్తుంది. పశ్చిమ దేశాల సమాజాల ఆధునిక జీవనశైలి రాత్రి భోజనం మరీ ఆలస్యంగా చేయడం, పొద్దునే టిఫిన్ తీసుకోకపోవడం మొదలైన ఆహారపు అలవాట్లకు దారితీసింది. అయితే, ఉదయం, రాత్రి భోజనాలు వీలైనంత తొందరగా ముగించుకునే అలవాట్లను స్వీకరిస్తే గుండె రక్తనాళాల వ్యాధుల ముప్పు తగ్గించుకోవచ్చు'' అని పరిశోధకులు పేర్కొన్నారు.



# గ్లైఫోసేట్.. గర్భిణులకు ముప్పు

**గ్లైఫోసేట్‌ను** పంటల్లో కలుపు నివారణకు వాడతారు. ఇది పంటలకు హాని కలిగించకుండానే కలుపును నిర్మూలిస్తుంది. కాబట్టి, రైతులు దీన్ని విస్తృతంగా వాడుతున్నారు. ఏండ్ల తరబడి జరిగిన అధ్యయనాల ద్వారా గ్లైఫోసేట్ మనుషుల్లో క్యాన్సర్‌కు కారణం కావచ్చని భావిస్తున్నారు. ఆహారం రూపంలో అంతగా హాని కలిగించనప్పటికీ గ్లైఫోసేట్ ఆధారిత రసాయనాలు మనుషులను వివిధ రకాలుగా ప్రభావితం చేస్తాయి. చర్మం మండుతుంది. శ్వాసిస్తే ముక్కు రంధ్రాల్లో ఇబ్బందిగా ఉంటుంది. కొన్నిసార్లయితే తీవ్రతను బట్టి కాలేయం, కిడ్నీల పనితీరును దెబ్బతీస్తుంది. మరణం కూడా సంభవించవచ్చు. అంతేకాదు... గ్లైఫోసేట్ గర్భిణుల మీద మరింత దుష్ప్రభావం చూపుతుంది. గర్భధారణ సమయం ఏ కొంచెం తగ్గినా కూడా పుట్టబోయే శిశువు జీవితంపై ప్రతికూల ప్రభావాలకు దారితీస్తుంది. పైగా బిడ్డ పుట్టకముందే శాశ్వత నష్టం కూడా జరగవచ్చు. బిడ్డ పుట్టిన తర్వాత కూడా శరీర పెరుగుదలకు సంబంధించిన సమస్యలు తలెత్తుతాయి. గర్భిణులపై గ్లైఫోసేట్ ప్రభావం గురించి అమెరికాకు చెందిన 'ది ఎన్విరాన్‌మెంటల్ హెల్త్ యూనిట్' జరిపిన సర్వేలో ఈ వివరాలు తెలిశాయి.



అధ్యయనం కోసం పరిశోధకులు 18– 40 సంవత్సరాల మధ్య వయసున్న 77 మంది మహిళల్ని ఎంచుకున్నారు. వీరిని 2015 జూన్ నుంచి 2016 జూన్ వరకు పరీక్షించారు. వీరి మూత్రం నమూనాల్లో దాదాపు 93 శాతం మందిలో గ్లైఫోసేట్ అవశేషాలు చెప్పుకోదగ్గ స్థాయిలో ఉన్నట్టు గుర్తించారు. పట్టణ మహిళలతో పోలిస్తే గ్రామీణుల్లో ఈ సమస్య ఎక్కువగా ఉన్నట్టు ఈ అధ్యయనంలో తేలింది. మొదట్లో దీనికి కారణం నీళ్లు కావచ్చని అనుకున్నారు. కానీ కలుపు నివారణకు గ్లైఫోసేట్ వాడటం వల్ల ఆయా పంటలను ఆహారంగా తీసుకోవడంతో ఈ దుస్థితి దాపురించిందని ఇప్పుడు అనుమానిస్తున్నారు. ఇది చిన్న అధ్యయనమే అయినప్పటికీ ఆహారం విషయంలో జాగ్రత్తగా ఉండాలనేది పరిశోధకుల హెచ్చరిక. మరో విషయం... గర్భిణులు తమ తొలి మూడు నెలల కాలంలో ఈ కలుపు నివారిణికి దూరంగా ఉండాలంటున్నారు పరిశోధకులు. లేదంటే తల్లిపాల ద్వారా కలుపుమందు అవశేషాలు పిల్లలకు చేరుకుంటాయి. కాబట్టి, రైతులు కూడా గ్లైఫోసేట్‌కు ప్రత్యామ్నాయాలను వాడాలి. గర్భిణులు తొమ్మిది నెలలపాటు ఈ కలుపుమందు ప్రభావం అసలే పడకుండా జాగ్రత్త వహించాలని పరిశోధకులు సూచిస్తున్నారు.

# నోరా స్పెషల్ సాంగ్



సూపర్‌స్టార్ రజనీకాంత్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'జైలర్ 2' నుంచి మరో క్రేజీ అప్‌డేట్ వచ్చేసింది. ఈ సినిమాలో బాలీవుడ్ బ్యూటీ నోరా ఫతేహీ స్పెషల్ సాంగ్‌లో సందడి చేయనున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ పాటను మేకర్స్ విడుదల చేశారు. అనిరుధ్ రవిచందర్ స్వరపరిచిన ఈ సాంగ్ ఫుల్ ఎనర్జిటిక్ బీట్‌తో, నోరా ఫతేహీ గ్లామర్, స్టెప్పులతో ఆకట్టుకునేలా ఉన్నది. నోరా ఫతేహీ స్పెషల్ పెర్ఫార్మెన్స్ ఈ పాటకు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో విద్యాబాలన్, రమ్యకృష్ణ, మిర్నా మీనన్, ఎస్‌జే సూర్య, యోగిబాబు తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సన్ పిక్చర్స్ నిర్మిస్తున్న ఈ మూవీ అక్టోబర్ 15న ప్రేక్షకుల ముందుకు రానుంది.



# డైరెక్షన్‌పై మనసుపడ్డ చిట్టి

'జాతిరత్నాలు' సినిమాతో హీరోయిన్‌గా మంచి గుర్తింపు తెచ్చుకున్న ఫరియా అబ్దుల్లా.. నటిగా విభిన్న పాత్రలతో అలరిస్తోంది. హీరోయిన్‌గానే కాకుండా స్పెషల్ సాంగ్స్, కామియోస్, సపోర్టింగ్ రోల్స్ చేస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. నటనతో పాటు దర్శక త్వం వహించాలన్నది తన ఆశ యమని తాజాగా ఫరియా వెల్లడిం చింది. డైరెక్ట ర్‌గా తన తొలి సినిమాకు సంబంధించిన స్క్రిప్ట్ పనులను ఇప్పటికే ప్రారంభించినట్లు తెలిపింది. ఇప్పటికిప్పుడే డైరెక్టర్‌గా మారే ఆలోచన మాత్రం లేదని స్పష్టం చేసింది. తన ఆలోచనలకు తగ్గట్టుగా కథను పూర్తి స్థాయిలో సిద్ధం చేసేందుకు సమయం తీసుకోవాలనుకుంటోంది. స్క్రిప్ట్ సంతృప్తినిచ్చే స్థాయికి వచ్చిన తర్వాతే నిర్మాతలకు వివరించాలని అనుకుంటోంది. ప్రస్తుతం పూర్తిగా కథా రచనపైనే దృష్టి సారించిన ఆమె.. స్క్రిప్ట్‌పైనే దృష్టి పెట్టింది.



# పెళ్లికి టైమ్ ఉందట!

టాలీవుడ్ క్రేజీ హీరోయిన్ శ్రీలీల పెళ్లిపై మరోసారి క్లారిటీ ఇచ్చింది. ప్రస్తుతం తన వయసు 25 ఏళ్లు కాగా.. ఇప్పట్లో పెళ్లి చేసుకునే ఆలోచన లేదని స్పష్టం చేసింది. గతంలోనూ కొన్ని సంవత్సరాల తర్వాతే పెళ్లి గురించి ఆలోచిస్తానని చెప్పిన సంగతి తెలిసిందే. ఓ బాలీవుడ్ యువ హీరోతో శ్రీలీల పెళ్లి అంటూ అప్పట్లో వార్తలు వచ్చినా.. అవన్నీ నిజం కాదని తేలిపోయాయి. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన శ్రీలీల.. భవిష్యత్తులో పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకుంటే, తనకు నచ్చిన లక్షణాలు ఉన్న వ్యక్తినే జీవిత భాగస్వామిగా ఎంచుకుంటానని చెప్పింది. ప్రస్తుతం మాత్రం పూర్తిగా కెరీర్‌పైనే దృష్టి పెట్టింది. ధనుష్ నటిస్తున్న 'ఓం'తో పాటు ఓ బాలీవుడ్ ప్రాజెక్ట్‌లో నటిస్తోంది. తెలుగులో తన తదుపరి చిత్రాన్ని ఇంకా ప్రకటించలేదు. ప్రస్తుతానికి పెళ్లి కంటే సినిమాలపైనే శ్రీలీల ఫోకస్ అన్నమాట.



# కొత్త జాన్వీని చూస్తాం!

బాలీవుడ్ భామ జాన్వీ కపూర్ ప్రస్తుతం కెరీర్ విషయంలో ఆచితూచి అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. 'పెద్ది' సినిమా విడుదల తర్వాత ప్రమోషనల్ కార్యక్రమాలకు పెద్దగా హాజరుకావడం లేదు. సినిమాలో తన పాత్రను గ్లామర్ కోణంలో చూపించిన తీరుపై జాన్వీ అసంతృప్తిగా ఉన్నట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి. ఇక బాలీవుడ్‌లోనూ వరుసగా సినిమాలు అంగీకరించకుండా.. మంచి పాత్రల కోసం ఎదురుచూస్తున్నట్లు సమాచారం. గ్లామర్, కమర్షియల్ రోల్స్ కంటే నటనకు ప్రాధాన్యం ఉన్న బలమైన పాత్రలు చేయాలని ఆమె భావిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు అల్లు అర్జున్ నటించనున్న 'రాకా'లో జాన్వీ హీరోయిన్‌గా నటించనుందనే ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన రాలేదు.



# కయదుకు నిరాశే..

వరుస సినిమాలతో బిజీగా ఉన్న హీరోయిన్ కయదు లోహర్‌కు మాత్రం సరైన బ్రేక్ దక్కడం లేదు. నాని హీరోగా నటించిన 'ది ప్యారడైజ్'పై భారీ ఆశలు పెట్టుకున్నప్పటికీ.. ఇందులో ఆమె పాత్రకు ఆశించిన స్థాయిలో ప్రాధాన్యం దక్కలేదనే టాక్ వినిపిస్తోంది. కథతో పెద్దగా సంబంధం లేని పాత్రకే పరిమితమైందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఏడాది 'ఫంకీ', 'పల్లీ చట్టాంబి', 'ఐయామ్ గేమ్', 'హృదయం మురళి' వంటి చిత్రాలతో వరుసగా ప్రేక్షకుల ముందుకు వచ్చినా.. కెరీర్‌ను మలుపు తిప్పే హిట్ మాత్రం దక్కలేదు. ప్రస్తుతం శివకార్తికేయన్, సూర్య వంటి స్టార్ హీరోలతో తమిళ చిత్రాల్లో నటిస్తున్న కయదు.. కోలీవుడ్‌లోనైనా తనకు కావాల్సిన బ్రేక్ రావాలని అభిమానులు ఆశిస్తున్నారు.